విశాఖపట్టణం
శనివారం 28 ఆగస్టు 2026

For a pure tomorrow..

# జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:217 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## ఎక్కడికైనా వస్తా..!

**డేట్.. టైమ్..ప్లేస్ ఫిక్స్ చెయ్**

**పులివెందులైనా, తాడేపల్లి అయినా ఓకే**

**డీఎస్సీపై జగన్ కు లోకేస్ సవాల్**



**(ప్రకాశం - జయజయహే)**


ఒంగోలులో టీడీపీ కార్యకర్తలు, నాయకుల సమన్వయ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉమ్మడి ప్రకాశం జిల్లా అంటే తనకెంతో ఇష్టమన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజా ప్రతినిధులు ..మిగతా 2లో

# నిర్వాసిత యువతకు ఎక్స్ గ్రేషియా

**కటాఫ్ ముగిసినా సరే అర్హులకు వర్తింపు**

**రూ. 169 కోట్ల నిధులు విడుదలకు గ్రీన్ సిగ్నల్**

**వెలిగొండ ప్రాజెక్టులో ప్రభుత్వం కీలక నిర్ణయం**





**(అమరావతి - జయజయహే)**

వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితుల విషయంలో కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టు నిర్మాణంలో ఇళ్లు, ఆస్తులు, భూములు కోల్పోయిన ప్రతి కుటుంబానికి అండగా నిలవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. కటాఫ్ తేదీ ముగిసినప్పటికీ, అర్హత కలిగిన యువతకు ఎక్స్ గ్రేషియా అందించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గెజిట్ నోటిఫికేషన్, సోషియో ఎకనామిక్ సర్వేలలో పేర్లు నమోదు కాని అర్హులైన నిర్వాసితులందరికీ సంపూర్ణ న్యాయం చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సాధారణంగా ప్రాజెక్టు అవార్డు పాస్ కాని వారికి పరిహారం అందడం కష్టం, కానీ అలాంటి యువతకు కూడా ఆర్థిక సాయం అందేలా చూడాలని అధికారులకు మార్గదర్శనం చేశారు. ముఖ్యమంత్రి ప్రతిపాదించిన మానవతా దృక్పథం ఆధారంగా కటాఫ్ తేదీ తర్వాత కూడా అర్హత పొందిన వారి కోసం ప్రత్యేకంగా రూ.169 కోట్ల ఎక్స్ గ్రేషియా నిధులను విడుదల చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఆధునిక దేవాలయాలైన ప్రాజెక్టుల కోసం త్యాగాలు చేసిన కుటుంబాలను ఆదుకోవడం తమ ప్రాథమిక బాధ్యత అని ప్రభుత్వం పేర్కొంది. 2019 కటాఫ్ తేదీ నుండి 2026 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున ఈ ఎక్స్ గ్రేషియా అందుతుంది. ఇదివరకే నిర్వాసితులకు అందించిన సాధారణ పరిహారానికి ఇది పూర్తి అదనం. గతంలో పొరపాట్ల వల్ల అవార్డు జాబితాలో నమోదు కాకుండా పోయిన నిర్వాసితులను క్షేత్రస్థాయిలో గుర్తించి, వారికి పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే 7,027 మంది నిర్వాసిత కుటుంబాలకు రూ.905 కోట్ల విలువైన పునరావాసప్యాకేజీని ప్రభుత్వం అందజేసింది. దీనికి తోడు నిర్వాసిత కుటుంబాల ..మిగతా 2లో




## ఏఐ కారిడార్‌గా విశాఖ

**గూగుల్ విశాఖ ఏఐ డాటా సెంటర్ కు టైమ్ లైన్**

**రెండేళ్లలో (2028) నాటికి తొలిదశ అంబాటులోకి**

**2032నాటికి పూర్తిస్థాయిలో కార్యకలాపాలు**

**సింగిల్ విండో సిస్టమ్ తో పనులు దూకుడు**

**భూగర్భ జల సంరక్షణ కోసం ఎయిర్ కూలింగ్ టెక్నాలజీ**

**మిగులు విద్యుత్ ను స్థానిక గ్రిడ్లకు అనుసంధానం**

**వ్యూహాత్మక సబ్ సీ కేబుల్ ల్యాండింగ్ సెంటర్ గా విశాఖ**

**గూగుల్ గ్లోబల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ (ఆసియా-పసిఫిక్) ప్రిన్సిపల్ అలెగ్జాండర్ స్మిత్**

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

ఒకప్పుడు ప్రశాంతమైన సముద్ర తీరాలు, మత్స్యకార గ్రామాలు, షిప్‌యార్డులకు మాత్రమే పేరుగాంచిన విశాఖపట్నం ఇప్పుడు ప్రపంచ టెక్నాలజీ రంగంలో రికార్డులు సృష్టించేందుకు సిద్ధమవుతోంది. అమెరికా వెలుపల గూగుల్ సంస్థ నిర్మిస్తున్న అతిపెద్ద డేటా సెంటర్ ప్రాజెక్టుకు విశాఖ వేదికగా మారింది. రూ.1.25 లక్షల కోట్లకు పైగా (15 బిలియన్ డాలర్లు) పెట్టుబడితో, 1 గిగావాట్ సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న ఈ బృహత్తర ప్రాజెక్టు ఆంధ్రా టెక్ భవిష్యత్తును పూర్తిగా ..మిగతా 2లో

## లోకల్ ఎలక్షన్స్ జగన్‌కు ఇష్టం లేదు

**స్థానిక ఎన్నికలంటే ఆయనకు భయం**

**అందుకే అడ్డుకోవాలని చూస్తున్నారు**

**జాప్యం చేస్తే మాకు నష్టం జరుగుతుందని ఆశ**

**అడ్డుకుని లబ్ధి పొందాలని కుతంత్రం**

**ప్రత్యక్ష ఎన్నికలతోనే ప్రజలకు మేలు**

**మీడియా చిట్ చాట్ లో సీఎం చంద్రబాబు**

**(అమరావతి - జయజయహే)**


వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్‌కు స్థానిక ఎన్నికలు జరగడం ఇష్టం లేదని ధ్వజమెత్తారు. శుక్రవారం మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో మీడియాతో సీఎం చంద్రబాబు చిట్‌చాట్ చేశారు. వైసీపీ నేతలు 'సర్'పై కోర్టుకెళ్లారని అన్నారు. స్థానిక ఎన్నికలు జాప్యం జరిగే కొద్ది అధికార పార్టీకి నష్టం కలుగుతుందనే ఆశ వైసీపీకి ఉందని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వానికి వ్యతిరేకత వస్తుందని ..మిగతా 2లో

## సోనియా ఆత్మకథపై కలకలం

**కీలకాంశాల తొలగింపునకు ఒత్తిడి**

**మోడీ, ఆర్ ఎస్ఎస్, చైనా చొరబాట్లు ప్రస్తావనపై వివాదం**

**(ప్రకాశం - జయజయహే)**




కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ఆత్మకథ ప్రచురణ వ్యవహారం ఇప్పుడు దేశ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఆమె రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం నుంచి ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్ఎస్ఎస్, చైనా చొరబాట్లకు సంబంధించిన కీలక అంశాలను తొలగించాలని ప్రచురణ సంస్థ పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియాఒత్తిడి తెచ్చింది. అయితే, తన జీవితకథలో ఎలాంటి మార్పులు లేదా తొలగింపులకు ఒప్పుకునేది లేదని సోనియా తేల్చిచెప్పడంతో ఆ సంస్థతో ఒప్పందం రద్దయింది. పెంగ్విన్ ఇండియా వెనక్కి తగ్గినప్పటికీ, ..మిగతా 2లో

## రైల్వే కూలీ.. రాత్రికి రాత్రే ఐఏఎస్

**చదువుకున్నా ఉద్యోగం లేక లైసెన్స్ డ్ కూలీ**

**స్టేషన్లో ఫ్రీ వైఫైతో మొబైల్‌తోనే కోచింగ్**

**ఆన్‌లైన్ సమాచారంతో యూపీఎస్సీకి సిద్ధం**

**కుమార్తెకు మంచి భవిష్యత్తు కోసం లక్ష్యంతో అభ్యాసం**

**ఎట్టకేలకు ఐఏఎస్ కావడంతో మారిన కుటుంబ రాత**

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**



కేరళలోని మున్నార్‌కు చెందిన శ్రీనాథ్‌కు వివాహమై, ఓ కుమార్తె ఉంది. చదువుకున్నప్పటికీ తనకు నచ్చిన ఉద్యోగం దొరకకపోవడంతో కుటుంబ పోషణ కోసం ఎర్నాకులం రైల్వే స్టేషన్‌లో ..మిగతా 2లో



## పీఎం సూర్యఘర్‌లో రాష్ట్రం టాప్

**రూఫ్ టాప్ సోలార్‌లో అగ్రస్థానం**

**కేంద్ర ఇంధన వనరుల శాఖ వెల్లడి**

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

పీఎం సూర్యఘర్ ముఫ్తి బిజిలీ యోజన కింద యుటిలిటీ లెడ్ అగ్రిగేషన్ (యూఎల్‌ఏ) విధానంలో రూఫ్‌టాప్ సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటులో రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో 1.41 లక్షల కనెక్షన్లు పూర్తయ్యాయని కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల మంత్రిత్వశాఖ (ఎంఎన్‌ఆర్‌ఈ)తన నివేదికలో పేర్కొంది. యూఎల్‌ఏ విధానం కింద తొలి దశలో అనుమతించిన వాటిలో 5 రాష్ట్రాల్లో 2.23 లక్షల యూనిట్లు ఏర్పాటయ్యాయి. దీనికోసం రూ.525.69 కోట్ల రాయితీని కేంద్రం విడుదల చేసింది. ఏపీ తర్వాత స్థానాల్లో ఒడిశా (73,867 యూనిట్లు), తెలంగాణ (7,442యూనిట్లు) ఉన్నాయి. దేశంలో 30 లక్షల యూనిట్ల ఏర్పాటు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 12 రాష్ట్రాలు/కేంద్రపాలిత ..మిగతా 2లో



## పర్యావరణ పరిరక్షణకు చర్యలు

**ప్రస్తుతం 29 శాతం మాత్రమే గ్రీనరీ**

**2047 నాటికి 50శాతం పెంచేందుకు కృషి**

**గ్రీన్ బోర్డు చైర్మన్ నాగబాబు వెల్లడి**

**అటవీశాఖ కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ**

**సీఎం చంద్రబాబుతో బేటీ**

**(మంగళగిరి - జయజయహే)**

రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని గ్రీన్ బోర్డ్ ఛైర్మన్, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు చెప్పారు. మంగళగిరిలోని అటవీ శాఖ కార్యాలయంలో గ్రీన్ బోర్డు ఛైర్మన్‌గా నాగబాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలో 29 శాతం గ్రీనరీ ఉందని, దానిని 2047 నాటికి 50 శాతానికి పెంచేందుకు కృషి చేస్తానన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రీన్ బోర్డ్ ..మిగతా 2లో

## అప్పు రూ.22,006.57 కోట్లు.. తీర్చాల్సింది రూ. 6.5 కోటే

**జీ మీడియా వ్యవస్థాపకుడు సుభాష్ చంద్రకు భారీ ఊరట**

**వేల కోట్ల ఎగవేసినా పెద్ద మొత్తంలో మిహాయింపు**

**సోషల్ మీడియాలో రచ్చ.. రచ్చ..**

**నాకో రూల్.. ఆయనకో రూలా. .? - విజయ్ మాల్యా ధ్వజం**

**ఎన్ సీఎల్టీ తీర్పుపై దేశవ్యాప్తంగా చర్చ**



**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

భారతీయ కార్పొరేట్ దివాలా చరిత్రలోనే అత్యంత విస్మయపరిచే తీర్పు వెలువడింది. జీ మీడియా గ్రూప్ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్రకు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) భారీ ఉపశమనం అందించింది. వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు ఆయన చెల్లించాల్సిన రూ.22,006.57 కోట్ల రుణాలకు గాను కేవలం రూ.6.5 కోట్లు చెల్లిస్తే సరిపోతుందంటూ సమర్పించిన పరిష్కార ప్రణాళికకు ఎన్‌సీఎల్‌టీ ఆమోదముద్ర వేసింది. అంటే ..మిగతా 2లో

## విశాఖలో ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు

2

**ఉగ్రవాద కేసుల సత్వర విచారణకు కేంద్రం కీలక నిర్ణయం**




## మా డబ్బులు మాకు ఇవ్వండి..!

**రూ. 40 వేల కోట్ల బాకాయిలు చెల్లించాల్సిందే**

**ప్రభుత్వానికి మేం వ్యతిరేకం కాదు**

**హక్కుల సాధన కోసమే రోడ్డెక్కుతున్నాం**

**ప్రభుత్వానికి ఉద్యోగులు అల్టిమేటమ్**

**మూడు దశల్లో పోరాటాలకు ప్రణాళిక**

2

For a pure tomorrow..
జయజయహే

# ఏఐ కారిడార్‌గా విశాఖి

మొదటి పేజీ తరువాయి...

మార్చేయనుంది. 2024 చివర్లో గూగుల్ ఇంజనీర్ల బృందం విశాఖను సందర్శించి అధ్యయనం చేయగా, సరిగ్గా ఏడాది వ్యవధిలోనే 2025 అక్టోబర్ 14న గూగుల్ ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రకటించింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్, భారతీ ఎయిర్‌టెల్ భాగస్వామ్యంతో నిర్మిస్తున్న ఈ కేంద్రం పనులు 2026 ఏప్రిల్ నాటికే వేగంగా ప్రారంభమయ్యాయి.

**సింగిల్ విండో సిస్టమ్‌తో దూకుడు**

భారతదేశంలో వ్యాపార నిర్వహణ ఎంత సులభతరమైందో ఈ ప్రాజెక్ట్ వేగమే నిదర్శనమని గూగుల్ గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఆసియా-పసిఫిక్) ప్రిన్సిపల్ అలెగ్జాండర్ స్మిత్ పేర్కొన్నారు. "కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన సింగిల్ విండో క్లియరెన్స్ విధానం వల్ల భూమి, విద్యుత్, ఇతర చట్టపరమైన అనుమతులు అతి తక్కువ సమయంలో లభించాయి. సింగపూర్ వంటి అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చినా ఇంత వేగంగా అనుమతులు రావడం ఒక రికార్డు" అని అలెగ్జాండర్ స్మిత్ స్పష్టం చేశారు. అయితే, 2026 ఆగస్టు 24న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలిపివేసేందుకు నిరాకరించినప్పటికీ, ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని అధికారిక పత్రాలను తమ ముందు ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కోర్టు పరిశీలన ప్రక్రియ పూర్తయ్యే తీరును బట్టి నిర్మాణ వేగం ఆధారపడి ఉంటుంది.

**విశాఖ 'ఇండియాస్ న్యూ బెంగళూరు' కాబోతుందా?**

గూగుల్ రాకతో విశాఖపట్నం చుట్టుపక్కల ప్రాంతం ఒక ప్రధాన 'ఏఐ కారిడార్' గా రూపాంతరం చెందుతోందని టెక్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో గూగుల్ లాంటి సంస్థకు ఉన్న వ్యూహాత్మక ప్రాధాన్యత అపారమైనది. గూగుల్ ఇక్కడ అడుగుపెట్టడంతో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ భాగస్వాములే కాకుండా, ఐటీ ఆధారిత సేవలందించే దిగ్గజ కంపెనీలు కూడా విశాఖ బాట పడతాయి. విశాఖపట్నం త్వరలోనే దేశంలోనే సరికొత్త బెంగళూరుగా అవతరిస్తుంది" అని ప్రముఖ ఏఐ కన్సల్టెన్సీ సంస్థ కన్వర్జెన్స్ క్యాటలిస్ట్ పార్ట్‌నర్ జయంత్ కొల్లా అభిప్రాయపడ్డారు. ఇప్పటికే రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్, గ్రీన్ కో మద్దతు ఉన్న ఏఎం ఇంటెలిజెన్స్ వంటి దిగ్గజాలు విశాఖ పరిసరాల్లో తమ సదుపాయాలను ప్రకటిస్తుండగా, అనేక అనుబంధ చిన్న తరహా సరఫరాదారులు కూడా ఇక్కడే తమ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు. సముద్రగర్భ కేబుల్ వ్యవస్థ, స్థానిక అభివృద్ధి విశాఖపట్నం భౌగోళికంగా అత్యంత సురక్షితమైన ప్రాంతం కావడమే కాకుండా, నెట్‌వర్క్ వేగాన్ని పెంచే మూడో 'సబ్‌సీ కేబుల్ లాండింగ్ సైట్' గా మారే అన్ని అనుకూలతలు ఉన్నాయని గూగుల్ ప్రతినిధులు తెలిపారు.

**స్థానికులకు ప్రయోజనాలు**

ఈ డేటా సెంటర్‌లో భూగర్భ జల పరిరక్షణ కోసం ఎయిర్-కూలింగ్ టెక్నాలజీని వాడుతున్నారు. దీనివల్ల నిరంతరం మంచి నీటిని వినియోగించాల్సిన అవసరం ఉండదు పవర్ సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుల్స్ మౌలిక వసతులను గూగుల్ అభివృద్ధి చేస్తోంది. ఇది పవర్-సర్ప్లస్ సదుపాయం కావడం వల్ల మిగులు విద్యుత్‌ను స్థానిక గ్రిడ్‌కు అందిస్తుంది. తీరప్రాంత మత్స్యకారులు మెరుగైన వేట సాధించి, ఎక్కువ రాబడి పొందేలా జీపీఎస్ టెక్నాలజీ వాడకంపై ప్రత్యేక శిక్షణ అవగాహన కార్యక్రమాలను గూగుల్ చేపడుతోంది. ప్రస్తుతం విశాఖలో భూమిని సిద్ధం చేసే పనులు జరుగుతున్నాయి. మొదటి విడత 2028 మధ్య నాటికి (రాబోయే రెండేళ్లలో) అందుబాటులోకి వస్తుంది. పూర్తి స్థాయి 1గిగావాట్ సదుపాయం 2032 నాటికి (రాబోయే 5-6 ఏళ్లలో) పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుంది.

## సోనియా ఆత్మకథపై కలకలం

మొదటి పేజీ తరువాయి...

పెంగ్విన్ అంతర్జాతీయ విభాగమైన 'ఆల్ఫ్రెడ్ ఏ నాఫ్' ఈ పుస్తకాన్ని నవంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి నిశ్చయించింది. భారత్‌లో ఈ పుస్తక ప్రచురణ, పంపిణీ హక్కుల కోసం హార్పర్ కాలిన్స్ సంస్థ వేగంగా అడుగులు వేస్తోంది. 79 ఏళ్ల సోనియా గాంధీ తన రాజకీయ ప్రస్థానంలో ఎదురైన అనుభవాలు, ప్రధాని మోదీతో భేటీలకు సంబంధించిన వివరాలను పుస్తకంలో సమగ్రంగా పొందుపరిచారు. ముఖ్యంగా 2004 గుజరాత్ ఎన్నికల ప్రచారంలో మోదీ తనను ఉద్దేశించి చేసిన "జెర్సీ ఆవు" వ్యాఖ్యల ప్రస్తావనను కూడా ఆమె గుర్తుచేసుకున్నారు. ప్రధాని మోదీతో పాటు ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు, సరిహద్దుల్లో చైనా చొరబాట్లపై సోనియా రాసిన భాగాలపై పెంగ్విన్ ఇండియా తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ప్రధానంగా 3-4 పేరాలను పూర్తిగా తొలగించాలని పట్టుబట్టింది. ప్రధాని మోదీని ఇతర మాజీ ప్రధానమంత్రులతో పోలుస్తూ సోనియా చేసిన విశ్లేషణలు, వాస్తవ నియంత్రణ రేఖ వద్ద చైనా ఆక్రమణలపై రాసిన పాఠాలు వివాదానికి మూలంగా మారాయి. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సోనియా గాంధీలు గతంలోనూ సరిహద్దు భద్రతపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని గట్టిగా ప్రశ్నించిన సంగతి తెలిసిందే.

**కాంగ్రెస్ ఘాటు కౌంటర్**

ఈ వివాదంపై పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా స్పందిస్తూ.. "ఎడిటోరియల్ మార్పుల ప్రతిపాదనల వల్లే పుస్తకాన్ని ప్రచురించడం లేదనుకోవడం సరికాదు. పుస్తక నాణ్యతను కాపాడటం, ఫ్యాక్ట్-చెక్ చేయడం ప్రచురణకర్తగా మా బాధ్యత" అని వివరణ ఇచ్చింది. అయితే ఈ వాదనను కాంగ్రెస్ తీవ్రంగా తోసిపుచ్చింది. "గ్లోబల్ పెంగ్విన్ సంస్థ పుస్తకాన్ని ప్రచురిస్తున్నప్పుడు, ఇండియా పెంగ్విన్ ఫ్యాక్ట్-చెక్ పేరు చెప్పడం విడ్డూరంగా ఉంది" అని ఎద్దేవా చేసింది. కాంగ్రెస్ నేత గౌరవ్ గొగొయ్ స్పందిస్తూ.. "పీఎం మోదీ రాసిన 'ఎగ్జామ్ వారియర్స్', ఆర్ఎస్ఎస్‌పై పుస్తకాలను ప్రచురించడానికి ఉత్సాహపడే పెంగ్విన్, ఇప్పుడు బీజేపీ ప్రభుత్వానికి భయపడి సోనియా పుస్తకం విషయంలో వెనకడుగు వేసింది," అని ఆరోపించారు. పెంగ్విన్ సంస్థ గతంలో మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణే ఆత్మకథ విషయంలోనూ ఇదే తరహాలో వ్యవహరించింది. నరవణే రాసిన పుస్తకంలో చైనా చొరబాట్ల సమయంలో రాజకీయ నాయకత్వం త్వరితగతిన నిర్ణయం తీసుకోకుండా సైన్యాన్ని ఒంటరిని చేసిందని పేర్కొన్న భాగాలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. ఫిబ్రవరి బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశంపై పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ మాట్లాడేందుకు ప్రయత్నించగా, సభలో తీవ్ర గందరగోళం నెలకొంది.

## రైల్వే కూలీ.. రాత్రికి రాత్రే ఐఏఎస్

మొదటి పేజీ తరువాయి...

లైసెన్స్‌డ్ కూలీగా చేరాడు. రోజంతా ప్రయాణికుల సామాన్లు మోస్తే సుమారు రూ.500 వరకు సంపాదించేవాడు. అయితే ఆ ఆదాయం తన కుటుంబ అవసరాలకు సరిపోదని శ్రీనాథ్ తరచూ ఆందోళన చెందేవాడు. ముఖ్యంగా తన కుమార్తెకు మంచి విద్య, మెరుగైన భవిష్యత్తు అందించాలనే ఆలోచన అతనిలో బలంగా ఉండేది. అదే ఆలోచన చివరకు అతడిలో ఐఏఎస్ అధికారి కావాలనే లక్ష్యాన్ని నాటింది. యూపీఎస్సీ పరీక్షకు సిద్ధం కావాలంటే ఖరీదైన కోచింగ్, పుస్తకాలు అవసరమని చాలామంది భావిస్తారు. కానీ శ్రీనాథ్ పరిస్థితి అందుకు భిన్నం. కోచింగ్‌కు, పుస్తకాలకు పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేసే స్తోమత అతనికి లేదు. డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కొన్ని రైల్వే స్టేషన్లలో ఉచిత వైఫై సదుపాయం అందుబాటులోకి రావడం శ్రీనాథ్‌కు ఎంతో ఉపయోగపడింది. అప్పు చేసి స్మార్ట్‌ఫోన్, హెడ్‌ఫోన్, మెమొరీ కార్డు కొనుగోలు చేశాడు. ఆ తర్వాత ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న స్టడీ మెటీరియల్, వీడియో పాఠాలు, ఆన్‌లైన్ సమాచారం ద్వారా యూపీఎస్సీకి సిద్ధమవడం ప్రారంభించాడు. రైల్వే స్టేషన్‌లో కూలీగా పనిచేస్తూనే ఖాళీ సమయాన్ని చదువుకు కేటాయించాడు. మూటలు మోస్తున్న చేతులే పుస్తకాలు పట్టాయి. ప్రయాణికుల కోసం ఎదురుచూస్తున్న సమయమే అతనికి చదువుకునే సమయంగా మారింది.

**నాలుగో ప్రయత్నంలో విజయం**

యూపీఎస్సీ లక్ష్యంగా సిద్ధమవుతున్న శ్రీనాథ్.. 2018లో కేరళ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష రాశాడు. ఈ పరీక్షను తనకు ఒక ప్రీ-ఫైనల్‌గా భావించాడు. అతని కష్టానికి ఫలితం దక్కింది. కేరళ పీఎస్సీలో మంచి ర్యాంక్ సాధించి ప్రభుత్వ ఉద్యోగాన్ని పొందాడు. దీంతో రైల్వే కూలీ జీవితానికి ముగింపు పలికాడు. ఉద్యోగం రావడంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. కానీ శ్రీనాథ్ లక్ష్యం మాత్రం అక్కడితో ఆగిపోలేదు. తన అసలు లక్ష్యం ఐఏఎస్ కావడమేనని శ్రీనాథ్‌కు తెలుసు. అందుకే ఉద్యోగం చేస్తూనే యూపీఎస్సీ పరీక్షకు తన ప్రయత్నాలను కొనసాగించాడు. మొదటి ప్రయత్నంలో విజయం దక్కలేదు. రెండోసారి కూడా నిరాశే ఎదురైంది. మూడో ప్రయత్నంలోనూ అనుకున్న ఫలితం రాలేదు. అయినా శ్రీనాథ్ వెనక్కి తగ్గలేదు. 2022లో యూపీఎస్సీ పరీక్షలో విజయం సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యాడు. ఒకప్పుడు రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సామాన్లు మోసిన వ్యక్తి.. ఇప్పుడు దేశ పరిపాలనా వ్యవస్థలో కీలక బాధ్యతలు చేపట్టే స్థాయికి చేరుకున్నాడు. శ్రీనాథ్ విజయానికి వెనుక కేవలం ఉద్యోగం సాధించాలనే కోరిక లేదు. తన కుమార్తెకు తాను అనుభవించలేని మంచి బాల్యం, మంచి విద్య, మెరుగైన జీవితం అందించాలనే తండ్రి తపన ఉంది. కష్టాలను చూసి ఆగిపోకుండా.. వాటినే తన విజయానికి మెట్లుగా మార్చుకున్నాడు. డబ్బు లేకపోవడం తన కలకు అడ్డంకి కాదని నిరూపించాడు. నేటి కాలంలో స్మార్ట్‌ఫోన్‌ను చాలామంది వినోదం, సోషల్ మీడియా, వీడియోలు, గేమ్స్ కోసం ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. కానీ శ్రీనాథ్ మాత్రం అదే స్మార్ట్‌ఫోన్‌ను తన జీవితాన్ని మార్చుకునే సాధనంగా ఉపయోగించాడు. సాంకేతికత మన జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుందనేది దాన్ని మనం ఎలా ఉపయోగిస్తున్నామనే దానిపైనే ఆధారపడి ఉంటుంది. పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా లక్ష్యంపై నమ్మకం ఉంటే మార్గం తప్పకుండా దొరుకుతుందని శ్రీనాథ్ కథ చెబుతోంది. డబ్బు లేకపోవడం ఓటమికి కారణం కాదు.. పట్టుదల లేకపోవడమే అసలు ఓటమి. కల పెద్దదిగా ఉన్నా.. మొదటి అడుగు చిన్నదే కావచ్చు. ఒక స్మార్ట్‌ఫోన్, ఉచిత వైఫై, ఖాళీ సమయం, చదువుకోవాలనే పట్టుదలతో ప్రారంభమైన శ్రీనాథ్ ప్రయాణం చివరకు ఐఏఎస్ లక్ష్యాన్ని చేరుకుంది. కలలు కనండి.. వాటిని నెరవేర్చుకునే వరకు ఆగకండి. శ్రీనాథ్ విజయగాథ నేటి యువతకు అదే సందేశాన్ని ఇస్తోంది.

## నిర్వాసిత యువతకు ఎక్స్ గ్రేషియా

మొదటి పేజీ తరువాయి...

జీవన భద్రత కోసం నెల రోజులకు సరిపడా ఉచిత రేషన్ కిట్‌ను పంపిణీ చేయాలని కూడా నిర్ణయించారు. దేశంలో ఏ ఇతర ప్రాజెక్టులోనూ ఇవ్వనంత భద్రత, భరోసాను వెలిగొండ నిర్వాసితులకు కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని మంత్రి నిమ్మల తెలిపారు. అర్హుల జాబితాలో తమ పేర్లను చేర్చాలంటూ ప్రభుత్వానికి సుమారు 1,800 గ్రీవెన్సులు, పిటిషన్లు వచ్చాయి. ఈ పిటిషన్లన్నింటినీ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేసిన వెంటనే, అర్హత సాధించిన ప్రతి ఒక్కరికీ ఎక్స్ గ్రేషియా చెల్లింపులు ప్రారంభమవుతాయి. "ఆగస్టు 31వ తేదీ నాటికి వెలిగొండ ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయడమే కాకుండా, చివరి నిర్వాసితుడికి పరిహారం అందించి న్యాయం జరిగే వరకు ఈ ప్రక్రియను ఆపబోం. నిర్వాసితులకు ఎక్కడా అన్యాయం జరిగిందనే మాట రాకుండా పారదర్శకంగా వ్యవహరిస్తాం. నిర్వాసిత కాలనీల్లో డ్రైనేజీ, రహదారులు, తాగునీరు వంటి అన్ని మౌలిక సదుపాయాలను వేగవంతంగా పూర్తి చేస్తాం" అని మంత్రి స్పష్టం చేశారు.

## పర్యావరణ పరిరక్షణకు చర్యలు

మొదటి పేజీ తరువాయి...

ఛైర్మన్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు నాగబాబు ధన్యవాదాలు తెలిపారు. గ్రీనరీ మీద నాకు చాలా ఆసక్తి ఉంటుంది. నేను ముందు నుంచీ మొక్కలు నాటడం కోసం కార్యక్రమాలు నిర్వహించేవాడ్ని. పవన్ కల్యాణ్‌కు కూడా పర్యావరణం, పచ్చదనం అంటే ఇష్టం. మా ఇద్దరి ఆలోచనలు ఇక్కడ కలుస్తాయి. రాష్ట్రాన్ని హరితహారంగా మార్చడమే మా బాధ్యత. ఇంతకు ముందు నాకు సంతోషాన్ని ఇస్తుంది కాబట్టి మొక్కలు నాటడం, ప్రకృతి కాపాడటంలో ముందున్నాను. ఇకపై బాధ్యతగా ఈ పని చేస్తా. ఇది నాకెంతో సంతృప్తినిస్తుందని ఆశిస్తున్నాను.' అని ఏపీ గ్రీన్ బోర్డ్ ఛైర్మన్ నాగబాబు వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుని మర్యాదపూర్వకంగా ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు కలిశారు. నేడు ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న అనంతరం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని సతీసమేతంగా కలిశారు. ఈ సందర్భంగా నాగబాబును సత్కరించి సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు.

## మా డబ్బులు మాకు ఇవ్వండి..!

(అమరావతి - జయజయహే)

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యమ బాట పట్టనున్నారు. రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యలు మరోసారి రాజకీయ, పరిపాలనా వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలోనే ఏపీ జేఏసీ అమరావతి 3 దశల్లో ఉద్యమానికి కార్యాచరణను ప్రకటించింది. ఉద్యోగుల హక్కులు, బకాయిల విడుదల, పీఆర్సీ కమిషన్ నియామకం, ఐఆర్ ప్రకటన సహా మొత్తం 29 డిమాండ్ల సాధనే తమ పోరాట లక్ష్యమని ఉద్యోగ సంఘం స్పష్టం చేసింది. ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.40 వేల కోట్లకు పైగా ఉన్నాయని జేఏసీ నేతలు చెబుతున్నారు. ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల సహనాన్ని మరింత పరీక్షించడం సరికాదని, ఈ ఉద్యమం ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాదని, న్యాయమైన హక్కుల సాధన కోసమేనని ఉద్యోగ సంఘాలు స్పష్టం చేశాయి.

**ఆగస్టు 31 నుంచి తొలి దశ ఉద్యమం :**

ఉద్యోగుల ఉద్యమంలో భాగంగా ఆగస్టు 31న జిల్లా కలెక్టర్లకు పీజీఆర్ఎస్ ద్వారా నోటీసులు ఇవ్వాలని నిర్ణయించారు. అదే రోజు నుంచి తొలి దశ కార్యక్రమాలను చేపట్టనున్నారు. సెప్టెంబర్ 1న 'సీఎం సార్.. మా డబ్బులు మాకివ్వండి' అనే నినాదంతో సెల్‌ఫోన్ డీపీలు పెట్టుకుని ఉద్యోగులు నిరసన చేపట్టనున్నారు. సెప్టెంబర్ 1 నుంచి సెప్టెంబర్ 5 వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కానున్నారు. సెప్టెంబర్ 2 నుంచి సెప్టెంబర్ 8 వరకు 'హ్యాండ్ టు హ్యాండ్' కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం కార్యాలయాలను సందర్శించి ఉద్యోగులను ఉద్యమంలో భాగస్వామ్యం చేయనున్నారు. సెప్టెంబర్ 3 నుంచి 5 వరకు భోజన విరామ సమయంలో నిరసనలు చేపట్టనున్నారు. సెప్టెంబర్ 11న అన్ని జిల్లా కేంద్రాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించనున్నారు. తదుపరి కార్యాచరణపై ఈ సమావేశాల్లో ఉద్యోగ సంఘాలు చర్చించనున్నాయి.

మొదటి దశ తర్వాత సెప్టెంబర్ 15 నుంచి సెప్టెంబర్ 26 వరకు రెండో దశ ఉద్యమం కొనసాగనుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రధానంగా 'వర్క్ టు రూల్' చేపట్టనున్నారు. సెప్టెంబర్ 15 నుంచి సెప్టెంబర్ 22 వరకు సోషల్ మీడియాలో ఫొటోలు, డీపీలు, రీల్స్ ద్వారా ఉద్యమాన్ని మరింత విస్తృతం చేయనున్నారు. సెప్టెంబర్ 15 నుంచి సెప్టెంబర్ 25 వరకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలను అందజేయనున్నారు. సెప్టెంబర్ 17న నల్ల కండువాలతో నిరసనలు, మానవహారాలు చేపట్టనున్నారు. సెప్టెంబర్ 23న కలెక్టరేట్లు, ఆర్డీఓ కార్యాలయాల వద్ద ధర్నాలు, సెప్టెంబర్ 26న ఉద్యోగుల కుటుంబ సభ్యులతో కలిసి 'మా డబ్బులు మాకివ్వండి' నినాదంతో ధర్నా చేపట్టనున్నారు. రెండో దశ తర్వాత కూడా సమస్యలు పరిష్కారం కాకపోతే మూడో దశలో రిలే నిరాహార దీక్షలు, సహాయ నిరాకరణ, ఛలో విజయవాడ, చివరకు నిరవధిక సమ్మె వంటి కార్యక్రమాలకు వెళ్లేలా ప్రణాళిక రూపొందించారు. ఉద్యోగుల ఉద్యమానికి ఏఐటీయూసీ, సీఐటీయూతో పాటు విద్యుత్, ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు కూడా సంఘీభావం ప్రకటించినట్లు జేఏసీ తెలిపింది. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఐక్యంగా ఉద్యమంలో పాల్గొనాలని ఉద్యోగ సంఘాల నేతలు పిలుపునిచ్చారు.

## విశాఖలో ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు

(విశాఖపట్నం - జయజయహే)

ఉగ్రవాదం, జాతీయ భద్రతకు సంబంధించిన కేసుల విచారణను వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు రాజస్థాన్, బిహార్‌లో కొత్తగా మూడు ప్రత్యేక ఎన్ ఐ ఏ కోర్టులను ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం, రాజస్థాన్‌లో జైపూర్, బిహార్‌లో పాట్నా నగరాల్లో ఈ ప్రత్యేక కోర్టులు పనిచేయనున్నాయి. నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ దర్యాప్తు చేసిన ఉగ్రవాదం, జాతీయ భద్రతకు సంబంధించిన కేసులను ఈ కోర్టులు విచారించనున్నాయి. ఎన్ ఐ ఏ చట్టం--2008లోని సెక్షన్ 11 ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సంబంధిత హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులతో సంప్రదింపులు జరిపిన అనంతరం ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసినట్లు కేంద్రం వెల్లడించింది. ప్రత్యేక ఎన్ ఐ ఏ కోర్టుల ఏర్పాటు ద్వారా ఉగ్రవాద కేసుల విచారణలో జాప్యాన్ని తగ్గించి, కేసులను వేగంగా పరిష్కరించేందుకు అవకాశం ఏర్పడనుంది. విశాఖలో ప్రత్యేక ఎన్ ఐ ఏ కోర్టు ఏర్పాటు కావడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన ఎన్ ఐ ఏ కేసుల విచారణకు మరింత ప్రాధాన్యత లభించనుంది.

## లోకల్ ఎలక్షన్స్ జగన్‌కు ఇష్టం లేదు

మొదటి పేజీ తరువాయి...

జగన్ అండ్ కో భావిస్తున్నారని సీఎం అన్నారు. పట్టణ, స్థానిక ఎన్నికలు ప్రత్యక్ష పద్ధతిలో జరగడమే మేలని చెప్పుకొచ్చారు. అప్పుడే రాజకీయ స్థిరత్వానికి నాంది పలుకుతామని వెల్లడించారు. మరో పవర్ సెంటర్ అనేది కరెక్ట్ కాదని.. నేతలు కలిసి పనిచేసుకోవాలని సూచించారు. అది సంస్థాగతంగా కూడా మంచిదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడమనేది చట్టపరమైన రక్షణ మాత్రమేనని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రతి ఎన్నికల్లో కూడా బీసీలకు తాము ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. 'సర్' తుది జాబితా కేంద్ర ఎన్నికల కమిషన్ ఎప్పుడూ ప్రకటించిన ఆది.. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే స్థానిక ఎన్నికలకు అడ్డుకాదని చెప్పారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్.. స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎప్పుడైనా ప్రకటించవచ్చని అన్నారు. వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభం ఓ చరిత్ర అని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. 30 ఏళ్ల క్రితం తానే ఈ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేశానని.. ఇప్పుడు తానే ప్రారంభిస్తున్నానని వ్యాఖ్యానించారు. తాను ప్రకాశం జిల్లాకు ఇచ్చిన హామీని నెరవేర్చానని అన్నారు. మార్కాపురం జిల్లా ప్రకటించానని ప్రస్తావించారు. వెలిగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేశానని... మొదటి దశను ప్రారంభిస్తున్నానని వెల్లడించారు. అదేవిధంగా వెలిగొండ ప్రారంభంతో పాటు హార్టీకల్చర్ హబ్‌గా మార్చామని చెప్పారు. పోలవరం నుంచి తొలిదశలో అనకాపల్లి వరకు నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. రెండో దశలో వచ్చే ఏడాది విశాఖపట్నం వరకు నీటిని తీసుకెళ్తామని వివరించారు. పోలవరం కూడా వచ్చే ఏడాది ప్రారంభిస్తామని అన్నారు. వెలిగొండ ప్రాజెక్ట్, మార్కాపురంతో ఆ ప్రాంతంలో ప్రజల నుంచి తమ ప్రభుత్వానికి సానుకూలత వ్యక్తం అవుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరిస్తే ఇలానే ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## ఎక్కడికైనా వస్తా..!

మొదటి పేజీ తరువాయి...

ఐక్యతగా పని చేస్తున్నారని తెలిపారు. ఒంగోలులో గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పడకేసిందని విమర్శించారు. అధ్వాన స్థితిలో రోడ్లు, ఎక్కడబడితే అక్కడ చెత్త ఉండేదన్నారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ వచ్చిన తర్వాతే ఒంగోలు రూపురేఖలు మారాయని చెప్పుకొచ్చారు. గొడ్డలి పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కనీసం ఒక్క తాగునీటి ప్రాజెక్టు కూడా నిర్మించలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కోట్ల రూపాయలు కేటాయించి వెలిగొండ పూర్తి చేశామని మంత్రి తెలిపారు. ఈనెల 31న వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభిస్తున్నామని అన్నారు. 'ప్రభుత్వం ఉన్నా లేకున్నా.. మనం మన బలంపై ఆధారపడాలి. మనం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కార్యకర్తలపై దాడులు చేశారు. పార్టీ ఇప్పుడు వారికి అండగా ఉంది. హత్యకు గురైన చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చాం. ఇచ్చిన హామీలు పద్ధతి ప్రకారం నిలబెట్టుకుంటూ వెళ్తున్నాం' అని వెల్లడించారు. 16 వేల ఆూజ ఉద్యోగాలు ఇచ్చామని.. 6 వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేశామని అన్నారు. రాబోయే మూడేళ్లూ డీఎస్సీ ఇస్తామని ప్రకటించారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడికి ఒక శాపం ఉందని.. ఆయన నిజం చెప్తే తల వెయ్యి ముక్కలవుతుందని జ్యోతిష్యులు చెప్పారంటూ ఎద్దేవా చేశారు. 'జగన్... టైమ్, డేట్ నువ్వే ఫిక్స్ చెయ్.. పులివెందుల రమ్మంటే వస్తా.. లేదా తాడేపల్లి రమ్మంటే వస్తా. డీఎస్సీపై చర్చించడానికి నేను సిద్ధం .. నువ్వు సిద్ధమా?' అంటూ పదోసారి డీఎస్సీపై జగన్‌కు మంత్రి సవాల్ విసిరారు. డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా లేకుండా మాజీ ముఖ్యమంత్రి జగన్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వంలో గ్రూపు 1 పరీక్షలో అవకతవకలు జరిగాయని కోర్టు చెప్పిందన్నారు. ఈగోలు లేకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి పని చేయాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు.

## పీఎం సూర్యఘర్‌లో రాష్ట్రం టాప్

మొదటి పేజీ తరువాయి...

ప్రాంతాల పరిధిలో సుమారు 16.58 లక్షల యూనిట్ల ఏర్పాటుకు ఎంఎన్ఆర్ఈ ఆమోదం తెలిపింది. అందులో 5.99 లక్షల కనెక్షన్లు ఏపీకే దక్కాయి. పథకం అమలుపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. 2027 మార్చి నాటికి దేశవ్యాప్తంగా మొత్తం కోటి రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. దీని కింద 5.99 లక్షల కనెక్షన్లకు ఉచిత విద్యుత్ అందుతోంది. యూఎల్ఏ విధానం కింద ఎస్సీ, ఎస్టీల ఇళ్లపై రూఫ్‌టాప్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గుత్తేదారులను నెడ్‌క్యాప్ ఎంపిక చేసి పనులు అప్పగించింది. వాటి ఏర్పాటుకు అయ్యే మొత్తాన్ని డిస్కంలే భరిస్తాయి. రాయితీ మొత్తాన్ని ప్రభుత్వం డిస్కంలకు తిరిగి చెల్లిస్తుంది. ఒక్కొక్కటి 2 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉన్న 5.99 లక్షల రూఫ్‌టాప్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా 1,198.21 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, తద్వారా 25 ఏళ్ల వ్యవధిలో ప్రభుత్వానికి రూ.8,690 కోట్లు ఆదా అవుతుందని ఇంధన శాఖ అంచనా. కేటాయించిన 5.99 లక్షల యూనిట్లలో జూన్ 4 నాటికి దాదాపుగా 2.28 లక్షల యూనిట్లు ఇన్‌స్టాల్ చేసినట్లు విద్యుత్ సంస్థలు తెలిపాయి. వాటిలో 1.41 లక్షల కనెక్షన్లు జాతీయపోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు.

## అప్పు రూ.22,006.57 కోట్లు.. తీర్చాల్సింది రూ. 6.5 కోట్లే

మొదటి పేజీ తరువాయి...

రుణదాతలు ఏకంగా 99.97 శాతం మేర తమ బాకీలను వదులుకోవాల్సి వస్తోంది. సామాన్యుడు చిన్న గృహ రుణం ఎగవేస్తే ఆస్తులను జప్తు చేసే బ్యాంకింగ్ వ్యవస్థ, వేల కోట్ల ఎగవేతపై ఇంత పెద్ద మొత్తంలో మినహాయింపు ఇవ్వడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**రూ.1,300 కోట్లకు ఇచ్చింది రూ.38 లక్షలే!**

ఎన్‌సీఎల్‌టీ (మూడో) సభ్యుడు నిలేష్ శర్మ నేతృత్వంలోని ధర్మాసనం ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్సీ కోడ్ (ఐబీసీ) సెక్షన్ 114 కింద ఈ ప్రణాళికకు అనుమతి ఇచ్చింది. గతంలో ఇద్దరు సభ్యుల బెంచ్ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడంతో కేసు మూడో సభ్యుడి వద్దకు వచ్చింది. అయితే ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి సంస్థలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి. తమకు రావాల్సిన రూ.1,322.39 కోట్లకు గాను కేవలం రూ.38.09 లక్షలు (అంటే కేవలం 0.028 శాతం) మాత్రమే చెల్లిస్తామనడం చట్టవిరుద్ధమని ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ కోర్టులో వాదించింది.

**సుభాష్ చంద్ర వివరణ ఇదీ..**

ఈ కేసులో 80.81 శాతం ఓటింగ్ షేర్ ఉన్న కన్సార్టియం రుణదాతలు ఈ ప్లాన్‌కు ఆమోదం తెలిపారు. దీనితో రుణదాతల వాణిజ్య నిర్ణయాన్ని కోర్టు ధిక్కరించలేదని ఎన్‌సీఎల్‌టీ స్పష్టం చేసింది. సుభాష్ చంద్ర వ్యక్తిగత ఆస్తుల విలువ కేవలం రూ.31.79 కోట్లు (ఇందులో రూ.25 కోట్ల విలువైన ఇల్లు ఉంది) మాత్రమేనని, ఆయనను పూర్తిగా దివాలా తీయించడం కంటే సంస్థను మళ్లీ నిలబెడితేనే అసలు రుణగ్రహీతల నుంచి సొమ్ము రికవరీ అయ్యే అవకాశం ఉంటుందని 144 పేజీల తీర్పులో పేర్కొంది. దీనిపై సుభాష్ చంద్ర స్పందిస్తూ, "నాకు ఏ బ్యాంకుతోనూ వ్యక్తిగత అప్పులు లేవు, కేవలం గ్యారంటీలు మాత్రమే ఇచ్చాను. నా కంపెనీలు తీసుకున్న రూ.45,000 కోట్ల రుణాల్లో ఇప్పటికే రూ.43,000 కోట్లు చెల్లించాం," అని తెలిపారు.

**మాల్యా సంచలన వ్యాఖ్యలు!**

ఎన్‌సీఎల్‌టీ తీర్పుపై రాజకీయ, ఆర్థిక వర్గాల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. "ఇది సాధారణ హెయిర్‌కట్ (రుణాల తగ్గింపు) కాదు, బ్యాంకింగ్ వ్యవస్థకు ఉచితంగా గుండు కొట్టడమే. 2016 దివాళా కోడ్‌ను ఇది పూర్తిగా హాస్యాస్పదం చేసింది," అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ తీవ్రంగా విమర్శించారు. మరోవైపు ఈ పరిణామంపై లండన్ నుంచి విజయ్ మాల్యా ట్విట్టర్ (ఎక్స్) వేదికగా స్పందించారు. "ఇదే నిజమైతే నా మిత్రుడు సుభాష్‌కు అభినందనలు. రూ.6,203 కోట్ల బాకీకి గాను బ్యాంకులు నా వద్ద నుంచి రూ.14,100 కోట్లు గుంజాయి. కానీ ఇతరులకు మాత్రం స్వల్ప మొత్తానికే సెటిల్మెంట్ చేస్తున్నారు. ఇదే మన దేశపు న్యాయం," అని ఎద్దేవా చేశారు. కాగా, ఈ తీర్పు ద్వారా తమకు కేవలం 3.2 శాతం రికవరీ మాత్రమే లభిస్తుండటంతో, ఎన్‌సీఎల్‌టీ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఎన్‌సీఎల్ఏటీలో అప్పీల్ చేయడానికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సమాయత్తమవుతోంది.

# దేశంలో తొలి సారిగా మడ వృక్షాలకు మహా రాఖీలతో బంధం వేసాం





**- మడ చెట్లు అంటే విపత్తుల ను అడ్డుకునే రక్షణ కవచం**

**- తీరప్రాంత రక్షణ వనాలు పెంచుదాం**

**- ప్రతి విద్యార్థీ పర్యావరణ హితంగా జీవించాలి**

**- ఎన్ రామచంద్ర రావు**

**కాకినాడ (జయ జయహే)**

దేశం లో తొలి సారిగా మడ వృక్షాలకు మహా రాఖీలతో బంధం వేసామని ఇది విడదీయరాని బంధం అని కాకినాడ జిల్లా అటవీ శాఖ అధికారి ఎన్. రామచంద్ర రావు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కాకినాడ అటవీ శాఖ కార్యాలయం వద్ద ఉన్న కానుగ చెట్టు కు రాఖీ కట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ రోజు కోరింగ అభయారణ్యంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం , రేంజ్ అధికారి వరప్రసాద్ నేతృత్వంలో మడ చెట్లకు వృక్షాబందన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది అన్నారు. అలాగే ఏలేశ్వరం రేంజ్ లో విద్యార్థులకు విత్తనాల రాఖీ ల గురించి అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించామన్నారు. అలాగే గడిచిన రెండు రోజులు గా 200 మంది విద్యార్థులకు విత్తనాలను అందజేసి 400 లకు పైగా రాఖీలను తయారు చేయించడం జరిగింది అని వివరించారు. మడ చెట్లు అంటే విపత్తుల ను అడ్డుకునే రక్షణ కవచం అని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తీరప్రాంత రక్షణ వనాలు పెంచడానికి తమవంతు సహకారం అందించాలని కోరారు. ప్రతి విద్యార్థీ పర్యావరణ హితంగా జీవించాలి అని పిలుపునిచ్చారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం మాట్లాడుతూ ఈ ఏడాది రాఖీ పౌర్ణమి చాలా విశిష్టత కలిగినది అని వివరించారు. ఒకటి మడ అడవుల్లో తొలి సారిగా వృక్షాబందన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది అని, రెండవది నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఎపి రాష్ట్ర విభాగం విత్తనాల రాఖీలను ప్రతిష్టాత్మకంగా చేపట్టడం అని పేర్కొన్నారు. వచ్చే ఏడాది విత్తనాల రాఖీ లకు మంచి గుర్తింపు లభిస్తుంది అని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ రేంజర్ వరప్రసాద్, సెక్షన్ ఆఫీసర్ సిద్ధార్థ, బీట్ ఆఫీసర్ మహేష్, చొల్లంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్దులు, ఉపాధ్యాయులు , ఆదిత్య విద్యా సంస్థ విద్యార్థినులు, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ సమన్వయకర్త జె రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



## అధికారులతో సమావేశమైన
# కమిషనర్ కేతన్ గార్గ్

**విశాఖపట్నం (జయ జయహే)**

వి ఎం ఆర్ డి ఎ మెట్రోపాలిటన్ కమిషనర్ గా పూర్తి అదనపు భాధ్యతలు స్వీకరించిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ శుక్రవారం వి ఎం ఆర్ డి ఎ అధికారులతో సమావేశమయ్యారు. మెట్రోపాలిటన్ కమిషనర్ గా పూర్తి అదనపు భాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా ఆయన వి ఎం ఆర్ డి ఎ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా వి ఎం ఆర్ డి ఎ అదనపు కమిషనర్ దాట్ల కీర్తి, ఓ ఎస్ డి కృష్ణ నాయక్, ముఖ్య ప్రణాళిక అధికారి దివ్య లత, కార్యదర్శి మురళీ కృష్ణ, అదనపు కార్యదర్శి శ్రీ రుషి బాబు, ఎస్టేట్ అధికారి దయానిధి, డి ఎఫ్ ఓ రమణమూర్తి, ఎస్ ఈ లు మధుసూదనరావు, రాంబాబు, ఈ.ఈ సుధీర్ తదితరులతో సమావేశమై, వి ఎం ఆర్ డి ఎ తరుపున ప్రస్తుతం చేపడుతున్న అభివృద్ధి పనుల వివరాలను తెలుసుకున్నారు.




# మాజీ సీఎం జగన్ పెళ్లిరోజు వేడుకలు

**కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపిన దక్షిణ వైయస్ఆర్సీపీ శ్రేణులు**


**విశాఖపట్నం( జయ జయహే)**

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్సిపి అధినేత జగన్మోహన్ రెడ్డి, భారతి దంపతుల పెళ్లిరోజు వేడుకలు దక్షిణ వైసిపి పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ముందుగా మాజీ ఎమ్మెల్యే, దక్షిణ వైసీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ కేక్ కటింగ్ చేశారు. దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసి అనంతరం మీడియాతో మాట్లాడారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, పేద ప్రజల అభ్యున్నతికి, విద్య వైద్యానికి పెద్దపీట వేసిన తమ అధినేత జగన్ మోహన్ రెడ్డి, భారతమ్మ దంపతుల దాంపత్య జీవితం ఐదు కోట్ల ప్రజల ఆశీస్సులతో సంతోషంగా జీవించాలని కోరారు. శ్రీ కనకమహాలక్ష్మి, సింహాద్రి అప్పన్న ఆశీస్సులతో మళ్లీ పేద ప్రజల జీవితాల్లో వెలుగు నింపేందుకు జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా వైఎస్ఆర్సిపి మళ్ళీ అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. అంధకారంలో ఉన్న ఆంధ్ర రాష్ట్రానికి మళ్లీ పండుగ రోజులు వస్తాయని, 2029 ఎన్నికల్లో , అలాగే స్థానిక ఎన్నికల్లో వైయస్సార్సీపీ సత్తా చాటుతుందని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ స్పష్టం చేశారు.

# సోదరభావానికి, ఐక్యతకు ప్రతీక రాఖీ పౌర్ణమి

**వాసుపల్లి కార్యాలయంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు**

**విశాఖపట్నం (జయ జయహే)**



మాజీ ఎమ్మెల్యే, దక్షణ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్, కార్యాలయంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళా కార్యకర్తలు, అభిమానులు వాసుపల్లి గణేష్ కుమార్ కి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను అందరూ కలిసి ఆనందంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ, మహిళల రక్షణ, సాధికారత కోసం తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. రాఖీ పౌర్ణమి సోదరభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తుందని అన్నారు. ఈ వేడుకల్లో రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వారికి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. వాసుపల్లి కలిసిన వారిలో మాజీ కార్పొరేటర్ పద్మనాభ అమ్మాజీ, పత్చిరిపిల్లి లక్ష్మి, స్టేట్ మహిళా విభాగం జనరల్ సెక్రెటరీ షబీర బేగం, స్టేట్ అంగన్వాడి వింగ్ జనరల్ సెక్రెటరీ సలాది భాను,సౌత్ మహిళా ప్రెసిడెంట్ వాసుపల్లి బంగారమ్మ, సౌత్ వాలంటరీ విభాగం ప్రెసిడెంట్ కడవల నాగమణి,జిల్లా మహిళా విభాగం జనరల్ సెక్రెటరీ నీలపు లక్ష్మి,వార్డ్ మహిళా ప్రెసిడెంట్స్ చెలపల్లి జ్యోతి, రోజా, రమణి,గాలి పార్వతి,వలిశెట్టి లక్ష్మి, ఝాన్సీ, అన్నపూర్ణ నాయిర్,చుక్కా ఈశ్వరి, కోసెట్టి దేవి,మణి, మీనా, బుర్రలు అరుణా,జ్యోతి దక్షిణ నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు వార్డు అధ్యక్షుల మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనీ వాసుపల్లి కి హారతులిచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.



# ఘనంగా పర్యావరణ రక్షాబంధన్ వేడుకలు

**ఎరుకువానిపాలెం, ఆగస్టు 28:(జయ జయహే )**

ఎంపీయూపీ పాఠశాల -- ఎరుకువానిపాలెంలో రక్షాబంధన్ వేడుకలను అత్యంత ఘనంగా, పర్యావరణ పరిరక్షణ సందేశంతో నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు తమ స్వయంకృషితో పర్యావరణహిత రాఖీలను తయారు చేశారు. రక్షాబంధన్‌ను వినూత్నంగా నిర్వహిస్తూ, విద్యార్థులు తయారు చేసిన రాఖీలను పాఠశాల ఆవరణలోని చెట్లకు కట్టి, "చెట్లను కూడా మన సోదరుల్లా రక్షించాలి" అనే సందేశాన్ని అందించారు. ప్రకృతిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అనే అవగాహనను ప్రధాన ఉపాధ్యాయలు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ విద్యార్థుల్లో పెంపొందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు కె.పీ.బి. శ్రీధర్ , ఉపాధ్యాయులు జయశ్రీ రాణి , సుజాత , ఉమ , కృష్ణారావు , మూర్తి , ఎస్ ఎం సీ చైర్మన్ అరిగా శ్రీను పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి భానుమతి ,పద్మిని లక్ష్మి , శ్రీలక్ష్మి అతిథులుగా హాజరై విద్యార్థులకు రాఖీలను పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులకు పండ్లను పంపిణీ చేసి, వారితో ఆనందాన్ని పంచుకున్నారు. విద్యార్థులను అభినందిస్తూ, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ఈ వినూత్న కార్యక్రమాన్ని అతిథులు ప్రశంసించారు.



# ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ నాగబాబుకు శుభాకాంక్షలు

**శ్రీకాళహస్తి**

మంగళగిరి మంగళగిరిలోని అరణ్య భవన్‌లో ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన నాగబాబును శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ కొట్టే సాయిప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర స్వామివారి తీర్థప్రసాదాలను నాగబాబుకు అందజేసి స్వామివారి ఆశీస్సులు అందించారు. ఆలయ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సంబంధించిన విషయాలపై ఈ సందర్భంగా పరస్పరం చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కుమార్, పర్వతాల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థులా... టెర్రరిస్టులా..!

**మారికవలస ఎస్టీ గురుకులం తరలింపు పరిణామాలపై గంటా ఫైర్**

**మధురవాడ, ఆగస్టు 28, జయ జయహే:**

"చదువుకునే పిల్లలేమైనా టెర్రరిస్టులా...అర్ధరాత్రి పూట వాళ్లని పెట్టే బేడాతో బయటకు పంపేయాల్సిన అవసరం ఏమొచ్చింది?" అని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఫైర్ అయ్యారు. సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ గా మార్చిన మారికవలస ఎస్టీ గురుకులాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. గత కొన్ని రోజులుగా పిల్లల విషయంలో అధికారులు, సిబ్బంది వైఖరి పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఒక మంచి ఉద్దేశంతో ప్రారంభిస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఆలోచన చేసిందని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా విద్యార్థులను బలవంతంగా ఖాళీ చేయించి గిరిజన ప్రాంతాలకు పంపడం సరి కాదన్నారు. అద్దె భవనాల్లో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ను ఏర్పాటు చేసే అవకాశాలు పరిశీలించాలని సూచించారు. తల్లిదండ్రులు, విద్యార్థులతో మాట్లాడి ఒప్పించిన తర్వాత వారిని పంపిస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఈ విధంగా చేయడం వల్ల ప్రజల్లో తప్పుడు సందేశం ప్రచారమవుతుందని చెప్పారు. గురుకులంలో 437 మంది విద్యార్థులు ఉండగా.. 6, 7, 8 తరగతుల వారిని సమీపంలో గురుకులానికి పంపామని, 9, 10 తరగతులు చదువుతున్న 70 మంది సెంట్రల్ జైల్ వద్దనున్న కృష్ణాపురం పాఠశాలకు వెళ్లారని ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్ వివరించారు. మిగిలిన 9, 10 తరగతుల పిల్లలకు కృష్ణాపురం పాఠశాలలో చేరే అవకాశం ఉన్నప్పటికీ పాడేరు వెళ్లిపోయారని తెలిపారు.






## పవిత్ర బంధానికి
# "రక్షాబంధన్" ప్రతీక

**మంత్రి ఎన్ఎండి ఫరూక్**

**అమరావతి, ఆగస్టు28 (జయ జయహే )**

రాఖీ అనేది కేవలం ఒక పండుగ కాదని, అన్నా-చెల్లెళ్లు, అక్కా-తమ్ముళ్ల మధ్య ఉన్న ప్రేమ,నమ్మకం,రక్షణ అనే పవిత్ర బంధానికి ప్రతీక అని మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. శుక్రవారం ఉర్దూ అకాడమీ చైర్మన్, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూక్ షుబ్లీ కార్యాలయంలో రాఖీ పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి ఫరూక్ హాజరయ్యారు. రాఖీ పండుగను పురస్కరించుకొని పలువురు అక్క చెల్లెల్లు మంత్రి ఫరూక్ చేతికి రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడారు. కులం, మతం, ప్రాంతం అనే తేడా లేకుండా ఈ పండుగ మనందరినీ ఒకే తాటిపైకి తెస్తుందన్నారు. మైనారిటీ సోదరీమణులు, హిందూ సోదరీమణులు వచ్చి రాఖీ కట్టడం - ఇదే మన భారతీయ సంస్కృతిలోని గంగా-జమునా తెహజీబ్ కు నిదర్శనమని పేర్కొన్నారు.రాష్ట్రంలో మహిళల రక్షణ, సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



# రూ. 3 కోట్లతో బయో ఫెర్టిలైజర్ ల్యాబ్

**శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గంటా**

**ఎండాడ, ఆగస్టు 28, జయ జయహే**

రాష్ట్ర ప్రభుత్వం రూ. 3 కోట్లతో ఎండాడలో ప్రతిపాదించిన బయో ఫెర్టిలైజర్ ల్యాబ్ ను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కాకినాడ జిల్లా సామర్లకోటలో మాత్రమే ఈ తరహా ల్యాబ్ ఉందని, కొత్తగా ఎండాడ సహా పల్నాడు జిల్లా అమరావతి, కర్నూలు జిల్లా ఎమ్మినగూరులలో నిర్మిస్తున్నారని వివరించారు. భవనానికి రూ.1.8 కోట్లు, మెషినరీ, మంచినీటి సరఫరా తదితరాల రూ.1.2 కోట్లు ఖర్చు చేయనున్నామని పేర్కొన్నారు. 6 వేల చదరపు అడుగుల్లో చేపడుతున్న నిర్మాణాన్ని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పర్యవేక్షనుంది. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు కొబ్బరినూనె, సబ్బులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీలు విజయ్ ప్రసాద్, మాణిక్యాంబ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి, జోనల్ కమిషనర్ వి.అయ్యప్ప నాయుడు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**పాయకరావుపేట జయ జయహే**

శ్రీ చైతన్య టెక్నో స్కూల్, పైకరపేట బ్రాంచ్‌లో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులు ప్రేమానురాగాలకు ప్రతీకగా రాఖీలు కట్టి, వారి ఆశీర్వాదాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎగ్జిక్యూటివ్ ఏ జి ఎం ఎం.వి. సురేష్ మాట్లాడుతూ, రక్షాబంధన్ పండుగ యొక్క విశిష్టతను, అన్నాచెల్లెళ్లు మరియు అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ప్రేమ, ఆప్యాయత, అనుబంధం గురించి వివరించారు. అలాగే రీజినల్ ఇంచార్జి శ . గోపీనాథ్ విద్యార్థులకు రక్షాబంధన్ పండుగ యొక్క ప్రాముఖ్యతను, భారతీయ సంస్కృతిలో సోదర--సోదరీ బంధానికి ఉన్న ప్రత్యేకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామరాజు, డీన్ మనీష్. ఇన్‌చార్జెస్ శ్రీనివాసు , కల్పనా , గౌరీ , త్రిమూర్తులు , , ఏ ఓ విజయ్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

For a pure tomorrow.. జయహో

# పునరుత్పాదక ఇంధన శక్తి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్

(ప్రతాప్)

**విద్యుత్తు అవసరాలు పెరుగుతున్నాయి. పరిశ్రమలు విస్తరిస్తున్నాయి. రవాణా రంగం విద్యుదీకరణ దిశగా సాగుతోంది. మరోవైపు వాతావరణ మార్పుల ప్రభావం ప్రపంచాన్ని ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వైపు నడిపిస్తోంది. ఈ మార్పును అవకాశంగా మలుచుకునే సామర్థ్యం ఆంధ్రప్రదేశ్‌కు ఉంది. విస్తారమైన భూభాగం, సుదీర్ఘ తీరప్రాంతం, సమృద్ధిగా లభించే సూర్యరశ్మి, అనుకూలమైన గాలులు.. రాష్ట్రాన్ని పునరుత్పాదక ఇంధన రంగంలో కీలక కేంద్రంగా తీర్చిదిద్దగల సహజ వనరులు.**

సౌర విద్యుత్తు రంగంలో ఇప్పటికే దేశవ్యాప్తంగా వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. భారీ సౌర పార్కులతో పాటు వికేంద్రీకృత సౌర విద్యుత్తుకూ ప్రాధాన్యం పెరుగుతోంది. పరిశ్రమల పైకప్పులు, ప్రభుత్వ భవనాలు, విద్యాసంస్థలు, వ్యవసాయ పంపుసెట్లపై సౌర ఫలకాలు ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్తు ఉత్పత్తిని ప్రజలకు చేరువ చేయవచ్చు. ముఖ్యంగా రైతులకు సౌర పంపుసెట్లు అందుబాటులోకి వస్తే సాగునీటి వ్యయాన్ని తగ్గించడమే కాకుండా, పగటిపూట ఉత్పత్తి అయ్యే విద్యుత్తును సమర్థంగా వినియోగించే అవకాశం ఉంటుంది.

పవన విద్యుత్తులోనూ ఆంధ్రప్రదేశ్‌కు గణనీయమైన అవకాశాలున్నాయి. సౌర, పవన విద్యుత్తును సమన్వయపరిచి హైబ్రిడ్ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తే విద్యుత్తు ఉత్పత్తిలో స్థిరత్వం పెరుగుతుంది. అయితే కేవలం భారీ ప్రాజెక్టులు ఏర్పాటు చేయడమే లక్ష్యం కాకూడదు. విద్యుత్తును నిల్వ చేసే బ్యాటరీ వ్యవస్థలు, పంప్డ్ స్టోరేజ్, ఆధునిక గ్రిడ్ మౌలిక వసతులు కూడా సమాంతరంగా అభివృద్ధి చెందాలి. అప్పుడే పునరుత్పాదక విద్యుత్తు నిరంతర సరఫరాకు బలమైన ఆధారంగా మారుతుంది.

ఇక గ్రీన్ హైడ్రోజన్ భవిష్యత్తులో మరో కీలక అవకాశం. పునరుత్పాదక విద్యుత్తును ఉపయోగించి ఉత్పత్తి చేసే గ్రీన్ హైడ్రోజన్‌ను ఉక్కు, ఎరువులు, రసాయనాలు, రవాణా వంటి రంగాల్లో వినియోగించవచ్చు. పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు, తీర ప్రాంత మౌలిక వసతులను అనుసంధానిస్తే ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి కేంద్రంగానే కాకుండా ఎగుమతి కేంద్రంగానూ ఎదగవచ్చు.

ఈ రంగంలో పెట్టుబడులు వస్తే ప్రయోజనం కేవలం విద్యుత్తు ఉత్పత్తికే పరిమితం కాదు. సౌర ప్యానళ్ల తయారీ, బ్యాటరీలు, విద్యుత్ పరికరాలు, నిర్వహణ, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి వంటి అనుబంధ రంగాల్లో వేలాది ఉద్యోగాలు ఏర్పడే అవకాశం ఉంది. స్థానిక యువతకు కొత్త ఉపాధి మార్గాలు తెరుచుకుంటాయి. పరిశ్రమలకు తక్కువ కార్బన్ విద్యుత్తు అందుబాటులోకి వస్తే రాష్ట్రంలో పెట్టుబడులకు మరింత ఆకర్షణ పెరుగుతుంది.

అయితే పునరుత్పాదక ఇంధన విస్తరణలో పర్యావరణం, భూమి వినియోగం, స్థానిక సమాజాల ప్రయోజనాలను విస్మరించరాదు. భూసేకరణలో పారదర్శకత, పర్యావరణ పరిరక్షణ, స్థానికులకు ఉపాధి, ప్రాజెక్టుల ప్రయోజనాల్లో భాగస్వామ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అభివృద్ధి ప్రకృతికి ప్రత్యామ్నాయం కాకూడదు; ప్రకృతితో కలిసి సాగాలి.

భవిష్యత్తులో ఇంధన భద్రతే ఆర్థిక భద్రతకు పునాది. ఆంధ్రప్రదేశ్ తన సూర్యుడు, గాలి, సముద్రతీరాన్ని కేవలం సహజ వనరులుగా కాకుండా ఆర్థిక వనరులుగా మలచుకోగలిగితే కొత్త పారిశ్రామిక శకం ప్రారంభమవుతుంది. పచ్చని విద్యుత్తు.. పరిశుభ్రమైన పరిశ్రమలు.. కొత్త పెట్టుబడులు.. కొత్త కొలువులు--- ఇదే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి భవిష్యత్ ఇంధనం కావాలి.

# జూడాల హామీలు అమలులో తాత్సారం ఎందుకు

రచన- కొమ్మనాబిల్లి అభిమన్యు

**ఏనుగు చేను మేస్తే తప్పు లేదు కానీ ఎలక నాలుగు గింజలు తినకుండా కంచె కట్టినట్టు . ప్రభుత్వం ప్రచార అర్బాటానికి కోట్ల రూపాయలు ఖర్చు చేసేటపుడు గుర్తు రాని పొదుపు విద్యార్థులకు ఇచ్చే స్టైఫండ్ విషయంలో లెక్కలేస్తోంది ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం . జుడా (జూనియర్ డాక్టర్లు)లు 16 రోజులుగా తమ డిమాండ్ల అమలు కోసం సమ్మె చేస్తూ ఆగస్టు 26 న జుడాలు కోర్టు ఆదేశాలతో శాంతించి సమ్మె విరమించారు.ప్రతి ఏడాది ప్రభుత్వం మొండికేయడం విద్యార్థులు 'సమ్మెకు దిగడం పరిపాటిగా మారింది . ప్రభుత్వ అధికార ఉత్తర్వులను ప్రభుత్వమే అమలు చేయడంలో కొర్రీలు పెడితే విద్యార్థులు ఎవరికీ చెప్పుకోవాలి . ప్రభుత్వ కంటితుడుపు చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారం కావాలని జుడాలు కోర్టును ఆశ్రయించారు. రాష్ట్ర ప్రభుత్వం ససేమిరా అంటున్నా తగ్గేది లేదంటున్న జూడాల పోరాటాన్ని పరిశీలిద్దాం .**




రాష్ట్రంలో ఉన్న 19 వైద్య కళాశాలల్లో సుమారు 3500 పిజి వైద్య విద్యార్థులు , ఇంటర్న్ చేసేవారితో సుమారుగా 9000 మంది ఉన్నారు. ఇంటర్న్ షిప్ చేసేవారికి ,పిజి విద్యార్థులకు ప్రతి నెలా స్టైఫండ్ చెల్లించాలి . స్టైఫండ్ చెల్లింపులో అడ్డంకులపై విద్యార్థుల పోరాటాల కారణంగా 2009 లో ప్రభుత్వం 287 జిఒ ను విడుదల చేసింది . ఈ జిఒ ప్రకారం వైద్య విద్యార్థులకు ప్రతి రెండేళ్లకోసారి 15 శాతం స్టైఫండ్ పెంపు చేయాలి. చివరిగా 2024 లో పెంచింది మరలా జనవరి 2026 లో పెంచాల్సి ఉన్న నేటికి 8 నెలలు గడుస్తున్నా పెంపు ఊసెత్తడం లేదు. ఆలస్యం పై జూడాలు ప్రభుత్వంతో 3 సార్లు చర్చలు జరిపినప్పటికీ ఆశించిన ఫలితం ఇవ్వలేదు . దీంతో జూలై నెల చివరిలో ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చిన ఫలితం లేకపోవడంతో ఆగస్టు మొదటి వారంలో విద్యార్థులు సమ్మెకు దిగారు . అయినా ప్రభుత్వం మొండి వైఖరి అవలంభించాడంతో నిరసనగా అత్యవసర వైద్య సేవలను సైతం రద్దు చేసుకున్నారు.

ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖకు బడ్జెట్ లో కేటాయింపులు 5 నుండి 6 శాతం వరకు ఉంటాయి . 2026-27 లో రూ.17,637వేల కోట్ల రూపాయలు కేటాయించారు . కేటాయింపు ఆధారంగా 15 శాతం పెంచితే స్టైఫండ్ కొరకు రూ.87 కోట్లు అవసరం. వైద్య ఆరోగ్య శాఖ కేటాయింపుల్లో కేవలం 0.3 శాతం మాత్రమే. అయినా ప్రభుత్వం ఇవ్వడానికి ఇష్టంలేక ఉద్యోగుల కన్నా జీతాలు ఎక్కువగా తీసుకుంటున్నారు , ప్రభుత్వం దగ్గర బడ్జెట్ లేదు వంటి కుంటి సాకులు చెప్తూ కాలం గడిపేస్తున్నారు .మన రాష్ట్రము కంటే వెనుకబడి ఉన్న హర్యానా , ఉత్తరప్రదేశ్ , బీహార్ రాష్ట్రాలు సైతం మెరుగైన స్టైఫండ్ అందిస్తున్నాయి. తాజాగా ప్రభుత్వం ఎంతో ఆర్బాటంగా నిర్వహించిన యోగంధ్ర నిర్వహణకు సుమారు రూ.89 కోట్లు ఖర్చు చేసారు. ఇలా ఏడాదిలో ఎన్నో ప్రచార కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ ప్రచారాలకు అయ్యేంత ఖర్చు కూడా లేని స్టైఫండ్ మంజూరులో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించటం ఎంతవరకు సమంజసం . ఇదేనా వైద్య విద్య పట్ల , విద్యార్థుల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి. అయినా విద్యార్థులు తమకు న్యాయంగా అందాల్సిన అధికారిక ఉత్తర్వుల్లో పేర్కొన్న విధంగా స్టై ఫండ్ ను అడుగుతున్నారు. అమలు చేయాల్సిన ప్రభుత్వం మొండి వైఖరి అనుసరించడం సరైనదా ?

ఇప్పటికే పిజి లు పూర్తి చేసి ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు వేళల్లో ఉన్నారు . ఈ నిరుద్యోగుల గోడు వినకుండా ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయసు ఇష్టారాజ్యంగా పెంచుకుంటూ పోతుంది . ఇప్పటికే పెంచిన 62 ఏళ్లను మరో 65 ఏళ్లకు పెంచేందుకు సిద్దమవుతోంది .ఇదే జరిగితే ఇప్పటికే వైద్య విద్యనూ పూర్తి చేసిన డాక్టర్లు నియామకాల కొరకు మరో మూడేళ్ళ వేచి చూడాల్సిందే. ఖాళీల లెక్క చూపకుండా , ఉద్యోగాలను భర్తీ చేయకుండా సీనియర్ సిటిజెన్ లతో నెట్టుకు రావడం యువ డాక్టర్లను నిర్లక్ష్యం చేయడం నిరుద్యోగాన్ని పెంచి పోషించడమే ఎంత అన్యాయం. ప్రభుత్వం ఇది ఎవరు బాగుకోసం పని చేస్తుంది , ఎవరడిగారని ప్రభుత్వం ఇలాంటి చవకబారు చర్యలకు పాల్పడుతోంది .

వైద్య విద్యార్థులకు బోదించేందుకు 5 సబ్జెక్టులకు గాను ప్రస్తుతం ఎమ్మెస్సీ , పి.హెచ్.డి పూర్తి చేసిన వారిని అనుమతిస్తున్నారు . ఆయా సబ్జెక్టులు బోదించేందుకు వీరికి అర్హత ఉన్న మాట వాస్తవం . కానీ వైద్య విద్యనూ పూర్తి చేసిన పిజీలు ఇందుకు అర్హులే కదా . గతంలో పిజి విద్యార్థుల కొరత ఉండేది కనుక పి.హెచ్.డి చేసే వారికి 85 శాతం బోధనా పోస్టులు కేటాయించారు , కానీ ఇప్పుడు ఎంతోమంది మెడికల్ విద్యార్థులు ఉన్నప్పుడు వారికి సమాన అవకాశాలు కల్పించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు . వైద్యులకు వైద్యులు బొదిస్తేనే అనుభవ పూర్వకంగా ఉంటుదని వారి వాదన . ఇరుపక్షాలు మెజారిటీ శాతం పోస్టుల కేటాయింపు కోరుకున్నప్పటికీ మెరిట్ ఆధారిత ఎంపిక ప్రక్రియ చేస్తే ఎవరికీ సమస్య ఉండకపోవచ్చు .

ఇలా ప్రదానంగా మూడు సమస్యలపై స్పష్టమైన హామీ కోసం పోరాడిన వైద్య విద్యార్థులు ప్రభుత్వం మొండి వైఖరిపై గుర్రుగా ఉన్నారు . ఒకడుగు ముందుకేసి హై కోర్టులో వాజ్యం దాఖలు చేసారు . ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల దృష్ట్యా , 16 రోజుల సమ్మెను పరిశీలించిన ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని తప్పు పట్టింది . తక్షణ చర్యలపై అబ్యంతరాలు తెలపాలని ఆదేశించింది . దీంతో శాంతించిన జూడాలు సమ్మెను విరమించి విధులకు , తరగతులకు హాజరయ్యారు . కానీ ఈ ఉపసమనం తాత్కాలికమే. అప్రమత్తంగా లేకపోతే ప్రభుత్వానికి తమ నిర్లక్ష్యం పై విశ్వాసం పెరిగి డిమాండ్లను పక్కన పెట్టేయోచ్చు . జూడాలు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి నిర్దిష్ట వైఖరి అవలంబించేల కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే ప్రతి ఏడాది సమస్య పరిష్కారం కోసం రోడ్డెక్కడంతో ఒకవైపు విద్యార్థులు విలువైన సమయాన్ని తరగతులను నష్టపోతున్నారు. మరోవైపు బోధనాసుపత్రుల్లో అందాల్సిన సేవలకు ఆటంకం ఏర్పడి ప్రజలకు అందాల్సిన వైద్య సేవలకు విఘాతం కలుగుతుంది .

# తెలుగు భాష తీయదనం తెలుగుజాతి గౌరవం

**తెలుగు వ్యవహారిక భాష అభినవ వాగమశాసనడు పితామహుడు శ్వాస ధ్యాస తెలుగు భాషకు అర్పించిన తెలుగు ధరణి తేజము మన గిడుగు వెంకట రామమూర్తి జయంతి ఆగస్టు 29వ తేదీన పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాష తీయదనము ప్రత్యేక శీర్షిక...**

మనిషికి మాట్లాడడము నేర్పేది భాష. జంతువులకు భాష లేదు. మనిషికి భాష ఉంది. అందుకే మనిషి గొప్పవాడు అయ్యాడు. ప్రపంచంలో సుమారు 7000 భాషలు ఉన్నాయి. అందులో మన తెలుగు భాష ఒకటి.తెలుగు భాష అనగా తేనె వంటి తీయనైన కమ్మని భాష. ఈ తీయదనాన్ని ప్రపంచానికి చాటి మన తెలుగు వెలుగును ముందు తరానికి భావి భారత పౌరులకు పంచాలని తెలుగు భాష గొప్పతనాన్ని మన పిల్లలకు తెలియజేయడానికి జరుపుకునే పండుగే తెలుగు భాషా దినోత్సవము.

**తెలుగు కేవలం ఒక భాష మన అమ్మను ఎలా అభిమానిస్తారో అమ్మ భాషను కూడా అలాగే ప్రేమించాలి గౌరవించాలి.**

ప్రపంచంలో పది కోట్ల మందికి పైగా తెలుగు మాట్లాడతారు. భారతదేశంలో అత్యధికంగా మాట్లాడే భాషలలో తెలుగు మూడవ స్థానం. ప్రపంచంలో 15వ స్థానం.

తెలుగు అనుగుణంగా చదువుకోవడానికి అనగా పండితులు మాత్రమే కాకుండా పామరులు కు కూడా అర్థమయ్యే రీతిలో సాహిత్య రచనలను విద్యారంగానికి అనుకూలంగా వ్రాసి అందించిన ఘనత గిడుగు వారి సొంతం. మూలపురుషుడిగా వ్యవస్థాపన చేసి ఈ మహత్తర యజ్ఞాన్ని నిర్వర్తించిన ఘన సాహితివేత్తగా గిడుగు మనకు ఆదర్శము.

**గ్రాంథిక భాషను తెలుగు భాషలోకి అనువదించుటకు మూలమైన అంశము**

గిడుగు వారు గ్రాంథిక భాషను వాడుక భాషలోకి మార్చుటకు మూలము అక్షరాస్యతను పెంచాలి అనే సత్ ఉద్దేశం. ప్రతి పిల్లవాడు చదువు అభ్యసిస్తే సమాజం శ్రేయస్సుగా ఉంటుంది అనేది ఆయన అభిప్రాయము. చదువుకోవాలి అంటే భాష చాలా అవసరం. సమాజం మారాలి అంటే చదువు చాలా అవసరము.చదువుకోవడం చాలా అవసరము. గురజాడ మొదలైన వారు గిడుగు వారి వాదనను బలపరిచి ఉద్యమానికి మద్దతు ఇచ్చారు.

**గిడుగు వారి జననము - వాడుక భాషా ఉద్యమం**

గిడుగు రామ్మూర్తి గారు 18 63 ఆగస్టు 29వ తేదీన శ్రీకాకుళం పర్లాకిమిడి సమీపంలో ముఖలింగం గ్రామంలో జన్మించారు. ప్రాథమిక హై స్కూల్ విద్యను చాలా కష్టతరంగా చదువుకొని దారిత్యాన్ని అనుభవిస్తూ చిన్నతనంలో తన తండ్రిని కోల్పోవడం వలన ఎన్నో రకాలైన కష్టాలను ఎదుర్కొంటూ ప్రైవేట్ గా మెట్రిక్యులేషన్ పూర్తి చేసి పర్లాకిమిడి గజపతి మహారాజా పాఠశాలలో 55 సంవత్సరాలు ఉపాధ్యాయుడుగా పనిచేశారు.

పాఠశాలలో గ్రాంథిక భాష (పండిత భాష) ఉండేది. సాధారణ ప్రజలు ఆ భాషను చదువుకొని అర్థం చేసుకోలేకపోయేవారు. అందుకే నిరక్షరాస్యులు ఎక్కువగా ఉండేవారు. అసలు అక్షరాస్యత అనేది చాలా తక్కువగా ఉండేది. ప్రజలందరికీ ఎలాగైనా విద్యను అందించాలి అనే ఆలోచన మొదలై ప్రజలు మాట్లాడే భాషలోకి గ్రాంథిక భాషను సులభంగా అర్థమయ్యే రీతిలో వాడుక భాషలోకి వ్రాయాలి అని అనుకున్నారు. గ్రాంథిక భాషలో ఉన్న పాఠ్యాంశాన్ని వాడుక భాషలోకి తయారు చేయాలి అని శ్రీకారం చుట్టారు.

**ఉదాహరణ:**

గ్రాంథిక భాష :- భవదీయుడు భోజనంబు చేయుచున్నాడు.

వాడుక భాష:- అతను అన్నం తింటున్నాడు.

ఇటువంటి విధంగా గ్రాంథిక భాషను తెలుగు భాషలోకి వాడుక భాషలోకి వ్రాయాలి అని సత్సంకల్పాన్ని సంకల్పించారు. కందుకూరి వీరేశలింగం పంతులు లాంటి ప్రముఖుల ప్రోత్సాహంతో మద్దతుతో "వర్తమాన వ్యవహారిక ఆంధ్ర భాష పరివర్తక సమాజం " ను స్థాపించి ముందుకు ఉద్యమాన్ని నడిపించారు. పండితులకే పరిమితమైన గ్రాంథిక భాష స్థానంలో ప్రజలు వాడే వ్యవహారిక భాష(సాధారణ భాష)ను అందించి ఆయన జీవితాంతం కృషి చేశారు.

**సవర (గిరిజన) భాషకు చేసిన గిడుగు సేవలు అనిర్వచనీయం.**

గిరిజనులతో - జీవనం - చదువు :-

గిరిజనులతో మమేకమై వారితో పాటు అడవులలో సంచరిస్తూ వారి జీవన విధానాన్ని అధ్యయనం చేసి వారి భాషను నేర్చుకొని వారికి యొక్క స్థితిగతులు తెలుసుకొని పూర్తిగా పరీక్షించి వారి భాష అయినా సవర భాషను తెలుగు భాషలోకి అనునవచడానికి గిడుగు వారి జీవితాన్ని అంకితం చేశారు.

**సవర - లిపి - వ్యాకరణం రచన :-**

లిపిలేని సవర భాషకు ఆయన ధ్వన్యాత్మక వర్ణనాత్మక లిపిని వ్యాకరణాన్ని రూపొందించి ఎంతగానో కృషి చేశారు దీని మూలంగా అక్షరాస్యుల్ని పెంచి గిరిజన ప్రాంతాన్ని ఎన్నో రకాలుగా అభివృద్ధి చేశారు.

**నిఘంటువుల - తయారీ-రచన :-**

గిడుగు వారు అనేక అనేక అర్థాలతో సవర భాష తెలుగు భాష మధ్య విషయాలను వివరిస్తూ నిఘంటువులను రచన జరిపి భాష యొక్క సమగ్ర అర్థాలను సమాధానములను పొందుపరిచారు.

**మన్యం ప్రాంతంలో ప్రత్యేక పాఠశాలలు:-**


పర్లాకిమిడి మన్యం ప్రాంతాలలో గిరిజన పిల్లలు చదువుకునేందుకు 1905లో తన యొక్క సొంత నగదుతో సవరుల కోసం ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేశారు.

లిపిలేని సవర భాషకు శాస్త్రీయమైన లిపిని వ్యాకరణాన్ని మరియు నిఘంటువుని రూపొందించిన అనేక విధాలుగా కృషిచేసిన విద్యావంతుడు, ఆదేశవాది, అక్షర యోధుడు మన్యం ప్రజల గుండెల్లో భాషా విప్లవకారుడు, అక్షరాస్యతాభివృద్ధికి విశేషమైన కృషి సేవలు చేసిన ఇంతటి మహోన్నతమైన వ్యక్తి యొక్క జన్మదినం రోజున ప్రభుత్వం తెలుగు భాషా దినోత్సవం గా జరుపుకోవాలని ఆదేశించింది

భారతీయులుగా మనమందరం విద్యార్థి దశలో ఉన్నప్పుడే కాకుండా తెలుగు భాషను ఎటువంటి విధంగా అభివృద్ధి చేయాలి అనే విషయాన్ని నిరంతరం మననము చేసుకుని తెలుగు భాష యొక్క అభివృద్ధి కి పాటుపడాలి.

**విద్యార్థి దశలో ఉన్నప్పుడు తెలుగు భాష అభివృద్ధి ఎటువంటి విధంగా చేపట్టాలి:-**

1. వ్యక్తిత్వ వికాసం చెందాలంటే వేమన సుమతి ఇతర శతక పద్యాలు చదవాలి నైతిక విలువలతో కూడిన సంస్కారం అంతా తెలుగు పద్యాలతోనే అభివృద్ధి జరుగుతుంది కానుక ప్రతి విద్యార్థికి శతక పద్యాలను కంఠస్థం చేయించాలి.
2. తెలుగు బాగా అభ్యసించడం వలన సంప్రదాయాల్లో ఉన్న ఆచారాలు బాగా అర్థమవుతాయి కనుక తెలుగుతనాన్ని విద్యార్థులకు అందిస్తూ ఉండాలి
3. ఆంగ్ల భాష మనకు ఉద్యోగాన్ని ఇస్తే తెలుగు భాష గుర్తింపు గౌరవాన్ని ఇస్తుంది అని తెలియచేయాలి.
4. తల్లిదండ్రుల వారి పిల్లలతో ప్రతినిత్యం ఇంటిలో తెలుగు భాషలో మాట్లాడాలి వారిని మాట్లాడించాలి.
5. తెలుగులో భావజాలం పిల్లలకు అర్థమయ్యే రీతిలో తల్లిదండ్రులు వివరించి నీతి కథలు చెప్పాలి.
6. తెలుగు ఎంత సుందరమైనది ఎంత మహోన్నతమైనది అనే విషయాలను తెలుగు అర్థాలతో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ప్రతి పదం ప్రతినిత్యం ఉపయోగిస్తూ ఉండాలి.
7. తెలుగులో ఉన్న భావనల మకరందం తెలుసుకోవాలి అంటే అనునిత్యం తెలుగును అభ్యసించాలి.
8. ఆంగ్లభాష అవసరానికి ఉపయోగము.ఆత్మీయతను పెంచేది తెలుగు భాష అని గుర్తించాలి.
9. నాయనమ్మ అమ్మమ్మ తాతయ్యలతో మాట్లాడాలి అంటే వారి అభిప్రాయాలను గౌరవించాలి అంటే తెలుగు యొక్క విలువ తెలుసుకొని పిల్లలలో తెలుగు భాషను అభివృద్ధి పరచాలి.




రచన :-
ఏ. బాల సౌజన్య కుమారి
తెలుగు ఆచార్యులు,
ఆధ్యాత్మిక,విద్యా వేత్త
ప్రవచనకర్త,
నంది అవార్డు గ్రహీత

# 55 ట్రిలియన్ వైపు భారత్.. వృద్ధికి కొత్త ఇంధనం

(ప్రతాప్)

2047 నాటికి భారత్ 55 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యం ఆకాశంలో రాసుకున్న అంకె కాదు.. ప్రపంచ ఆర్థిక శక్తుల సమీకరణాన్ని మార్చగల మహా సంకల్పం. ప్రధాన ఆర్థిక సలహాదారు తాజాగా పేర్కొన్నట్లుగా, ఏటా సుమారు 8 శాతం వాస్తవ జీడీపీ వృద్ధిని దీర్ఘకాలం కొనసాగిస్తూ, మూలధనాన్ని వ్యూహాత్మకంగా మళ్లిస్తే సమ్మిళిత వృద్ధి ప్రభావంతో ఈ లక్ష్యాన్ని చేరుకోవచ్చు. ఏఐ, తయారీ, ఎఫ్‌డీఐ, అంతరిక్షం, రక్షణ సాంకేతికత వంటి కొత్త తరం రంగాలే ఈ ప్రయాణానికి ఇంధనం.



ప్రస్తుత వేగం ఆశలు రేకెత్తిస్తోంది. 2025-26లో వాస్తవ జీడీపీ వృద్ధి 7.7 శాతంగా నమోదైంది. 2025-26 నాలుగో త్రైమాసికంలో వృద్ధి 7.8 శాతంగా ఉంది. సేవల రంగం ఇప్పటికే ఆర్థిక వ్యవస్థకు ప్రధాన చోదకశక్తిగా కొనసాగుతోంది. అయితే 55 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరాలంటే ప్రస్తుత వేగం మాత్రమే సరిపోదు. దీర్ఘకాలం అధిక వృద్ధిని నిలబెట్టే సామర్థ్యం కావాలి. ప్రపంచ ఆర్థిక మందగమనం, వాణిజ్య ఉద్రిక్తతలు, భౌగోళిక రాజకీయ పరిణామాలు వంటి సవాళ్ల మధ్య ఈ వేగాన్ని కొనసాగించడమే అసలు పరీక్ష.

ఏఐ.. కొత్త ఆర్థిక విప్లవం. ఉత్పత్తి, సేవలు, ఆరోగ్యం, వ్యవసాయం, బ్యాంకింగ్, విద్య, రవాణా.. దాదాపు ప్రతి రంగంలో ఉత్పాదకతను పెంచగల శక్తి కృత్రిమ మేధకు ఉంది. కానీ భారత్ కేవలం ఏఐను వినియోగించే దేశంగా మిగలకూడదు. స్వదేశీ ఏఐ నమూనాలు, డేటా మౌలిక వసతులు, చిప్ తయారీ, కంప్యూటింగ్ సామర్థ్యం, పరిశోధన, నైపుణ్యాభివృద్ధిలో ముందుకు వెళ్లాలి. ఏఐ యుగంలో యువతకు ఉద్యోగాలు తగ్గకుండా, కొత్త తరహా అవకాశాలు పెరిగేలా నైపుణ్య వ్యవస్థను మార్చాలి.

తయారీ రంగమే మరో కీలక ఇంజిన్. ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, ఔషధాలు, ఆటోమొబైల్స్, రక్షణ పరికరాలు, పునరుత్పాదక ఇంధన పరికరాల తయారీలో భారత్ ప్రపంచ సరఫరా గొలుసుల్లో తన వాటాను పెంచుకోవాలి. 2025-26 తొలి అర్ధభాగంలో తయారీ రంగం 8.4 శాతం వృద్ధి సాధించింది. సేవల స్థూల విలువ జోడింపు 9.3 శాతం పెరిగింది. ఈ ఊపు మరింత బలపడితే దేశీయ మార్కెట్‌తో పాటు ఎగుమతులకూ కొత్త ద్వారాలు తెరుచుకుంటాయి.

ఎగుమతుల విషయంలోనూ భారత్ బలమైన పునాది వేసుకుంది. 2024-25లో వస్తు, సేవల కలిపిన మొత్తం ఎగుమతులు రికార్డు స్థాయిలో 825.3 బిలియన్ డాలర్లకు చేరాయి. అదే ఏడాది స్థూల ఎఫ్‌డీఐ ప్రవాహాలు 81 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. 2025-26లోనూ ఎఫ్‌డీఐ ప్రవాహాలు ఊపందుకున్నాయి. విదేశీ పెట్టుబడులను కేవలం మూలధనంగా కాకుండా సాంకేతికత, నిర్వహణ నైపుణ్యం, ప్రపంచ మార్కెట్లకు అను-సంధానించే వంతెనగా మలచుకోవాలి.

దేశీయ డిమాండ్ కూడా వృద్ధికి బలమైన ఆధారం. 2025-26లో ప్రైవేటు వినియోగ వ్యయం జీడీపీలో 61.5 శాతానికి చేరుతుందని అంచనా. స్థూల స్థిర మూలధన కల్పన 7.8 శాతం పెరిగింది. కేంద్ర ప్రభుత్వ 2026-27 బడ్జెట్‌లో సమర్థ మూలధన వ్యయం రూ.17.15 లక్షల కోట్లు, అంటే జీడీపీలో 4.4 శాతంగా అంచనా వేశారు.

అయితే భారీ జీడీపీ లక్ష్యం ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచినప్పుడే దానికి అర్థం. తలసరి ఆదాయం పెరగాలి.. నాణ్యమైన ఉద్యోగాలు రావాలి.. వ్యవసాయ ఉత్పాదకత మెరుగుపడాలి.. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు బలపడాలి. విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు, పరిశోధన, మౌలిక వసతుల్లో పెట్టుబడులు పెరగాలి. ప్రాంతీయ అసమానతలు తగ్గాలి. వృద్ధి ఫలాలు కొద్దిమందికే పరిమితం కాకుండా విస్తృతంగా ప్రజలకు చేరాలి.

55 ట్రిలియన్ డాలర్లు ఒక గమ్యం మాత్రమే కాదు.. భారత ఆర్థిక సామర్థ్యానికి ఒక పరీక్ష. ఏఐ తెలివి.. తయారీ బలం.. యువత శక్తి.. పెట్టుబడుల ప్రవాహం.. ఎగుమతుల విస్తరణ.. మౌలిక వసతుల దూకుడు---ఈ చక్రాలన్నీ ఒకేసారి తిరిగితేనే లక్ష్యం చేరువవుతుంది. భారత్ వేగంగా ఎదగాలి; అంతకంటే ముఖ్యం, ఆ వృద్ధి ప్రతి రాష్ట్రానికీ, ప్రతి రంగానికీ, ప్రతి కుటుంబానికీ అవకాశంగా మారాలి. అదే 55 ట్రిలియన్ భారతానికి నిజమైన అర్థం.



## తెలుగు విశ్వవిద్యాలయానికి రూ.75 లక్షల సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన

**రాజమహేంద్రవరం: జయ జయహే**

ఆగస్టు 28:పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం బొమ్మూరు ప్రాంగణాన్ని పూర్వ వైభవానికి తీసుకొచ్చేందుకు ప్రజాప్రతినిధులుగా పూర్తి సహకారం అందిస్తామని రాజమహేంద్రవరం ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. శుక్రవారం విశ్వవిద్యాలయంలో రూ.75 లక్షల (రూడా గ్రాంట్) వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణ లక్ష్యంతో ఎన్టీఆర్ స్థాపించిన విశ్వవిద్యాలయ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలకు సహకరిస్తామని చెప్పారు. మౌలిక వసతుల కల్పన, ప్రాంగణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ మాతృభాషకు మరింత ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి సుమారు రూ.20 కోట్ల నిధులు సమకూర్చేందుకు హామీ లభించిందని, పాత భవనాల ఆధునీకరణ, ఇతర మౌలిక వసతుల కల్పన చేపడతామని తెలిపారు. అలాగే ఓఎన్జిసి తదితర ప్రభుత్వ రంగ సంస్థల సిఎస్ఆర్ నిధుల సమీకరణకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రూడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ మునిరత్నం నాయుడు, జిల్లా బిజెపి అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర హెల్త్ వింగ్ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవి రామ్ కిరణ్, టిడిపి రూరల్ మండల అధ్యక్షుడు మత్స్యేటి ప్రసాద్, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు వాసిరెడ్డి రాంబాబు, పందురి అప్పారావు, యానాపు యేసు, కూటమి నాయకులు తలారి మూర్తి, కొయ్యన కుమారి, ఆళ్ల ఆనందరావు, సావాడ శ్రీనివాసరెడ్డి, ఒంటెద్దు స్వామి, గుర్రాల వెంకట్రావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## మేయర్ రేసులో నేను కూడా ఉన్నా..
## అవకాశం ఇస్తే ప్రజలకు మెరుగైన సేవలు: మజ్జి రాంబాబు

**రాజమహేంద్రవరం: జయ జయహే : ఆగస్టు 28**



రాజమహేంద్రవరం మేయర్ పదవి రేసులో తాను కూడా ఉన్నానని టిడిపి నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు తెలిపారు. పార్టీ కోసం కష్టకాలంలోనూ విధేయుడిగా పనిచేశానని, రాజకీయ, సామాజిక, ప్రజాసేవా రంగాల్లో తనకున్న సుదీర్ఘ అనుభవాన్ని అధిష్టానం పరిగణనలోకి తీసుకుని అవకాశం కల్పిస్తుందనే నమ్మకం వ్యక్తం చేశారు.గత ఐదేళ్లుగా టిడిపి అధికారంలో లేకపోయినా నగరంలోని 42 వార్డుల్లో నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేస్తూ పార్టీని బలోపేతం చేశానన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు సిఐడి కేసుల్లో జైలులో ఉన్న సమయంలో పార్టీ కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేస్తూ ముందుండి బాధ్యతలు నిర్వహించానని చెప్పారు.6వ వార్డు ఇన్‌చార్జిగా 10--12 ఏళ్లు, పార్లమెంట్ ఉపాధ్యక్షుడిగా పనిచేసిన అనుభవంతో పాటు 2003 నుంచి సెంట్రల్ మార్కెట్ అభివృద్ధి, వ్యాపారులు, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానన్నారు. తూర్పు కాపు విద్యా విజ్ఞాన అభివృద్ధి సంక్షేమ సంఘంలో 12 ఏళ్లుగా కార్యదర్శిగా, గత నాలుగేళ్లుగా అధ్యక్ష బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నానని తెలిపారు.పార్టీ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని, ఏ బాధ్యత ఇచ్చినా అదే నిబద్ధతతో పనిచేస్తానని మజ్జి రాంబాబు స్పష్టం చేశారు.





## బియ్యం బస్తాల క్యూఆర్ స్కానింగ్ విధానంలో మార్పులు చేయాలి:

### డిలర్స్ అసోసియేషన్

**రాజమహేంద్రవరం: జయ జయహే: ఆగస్టు 28**

రాజమండ్రి రూరల్ మండలంలోని రేషన్ డీలర్లు బియ్యం బస్తాలపై క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి బస్తాను ఈ-పీఓఎస్‌లో నమోదు చేయాల్సి రావడంతో అదనపు హెల్పర్ అవసరమవుతోందని, పెరిగిన అద్దెలు, కూలీల ఖర్చులతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. స్కానింగ్‌ను గోదాములోనే లేదా సరుకు దిగుమతి సమయంలో నిర్వహించే విధానం అమలు చేయాలని, స్కానింగ్ కోసం ప్రభుత్వం స్మార్ట్‌ఫోన్లు అందించాలని కోరారు. ప్రస్తుతం క్వింటాకు రూ.1 మాత్రమే ఉన్న కమిషన్‌ను రూ.3కు పెంచాలని, డీలర్లకు బీమా, వైద్య సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మార్వో అందుబాటులో లేకపోవడంతో డిటి (సూపరింటెండెంట్) సువాసినికి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారు కొమ్మిశెట్టి వీర్రాజు, సబ్బితి రమేష్ బాబు, శ్రీరంగం బాలరాజు, రెడ్డి రాజు, కందుల ధనరాజు, కర్రీ సత్యనారాయణ, యలమర్తి త్రినాథరావు, అంగర భారతి, పెరమాటి ఆదిలక్ష్మి, ఏలేటి దేవి దుర్గ, వల్లూరి లక్ష్మీ రాజేశ్వరి.



## ఘనంగా జరిగిన మరిడిమాంబ మహోత్సవం

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి పట్టణంలోని చారిత్రాత్మక ప్రాధాన్యత కలిగిన కోటి వీధి లో కొలువై ఉన్న శ్రీ శ్రీ శ్రీ మరిడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవం అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలలో భక్తులు పాల్గొనడం జరుగుతున్నది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రామ్ కి అమ్మవారి జాతర మహోత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవడం జరిగింది ఆలయ పాలకవర్గ సభ్యులు ఘనంగా స్వాగతం పలకడం జరిగింది ఈ సందర్భంగా ఆయన పాలకవర్గ సభ్యులతో మాట్లాడుతూ అనకాపల్లి పట్టణానికి ఎంతో చారిత్రాత్మక ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన శ్రీశ్రీశ్రీ మరణమాంబ అమ్మవారి పండగ మహోత్సవం ప్రతి సంవత్సరం అత్యంత భక్తితో ఘనంగా నిర్వహిస్తున్నారని కమిటీ సభ్యులను ఆయన అభినందించడం జరిగింది . అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ఆయన అమ్మవారిని కోరుకోవడం జరిగింది రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆయన కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు




## ఖాకీకి రాఖీ.. చిన్నారుల ప్రేమకు పోలీసుల మురిపెం

**రాజమహేంద్రవరం:జయ జయహే:ఆగస్ట్ 28:**

ధవళేశ్వరం రాఖీ పౌర్ణమి సందర్భంగా ధవలేశ్వరం పోలీస్ స్టేషన్‌లోహృదయాన్ని హత్తుకునే దృశ్యం ఆవిష్కృతమైంది. రాజోలు గ్రామానికి చెందిన ఈస్ట్ రిడ్జ్ స్కూల్ విద్యార్థులు సిఐ గణేష్, ఎస్ఐ విజయ్ కుమార్‌లకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అహర్నిశలు ప్రజల రక్షణ కోసం విధులు నిర్వహిస్తూ, ముఖ్యంగా మహిళలు, బాలికల భద్రతకు భరోసాగా నిలుస్తున్న ఖాకీ వీరులను తమ సొంత అన్నదమ్ములుగా భావించి రాఖీలు కట్టడం ఎంతో ఆనందంగా ఉందని విద్యార్థులు పేర్కొన్నారు. చిన్నారుల ఆప్యాయతకు పోలీసులు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా మరింత బాధ్యతతో విధులు నిర్వర్తిస్తామని తెలిపారు. పోలీస్--ప్రజల మధ్య అనుబంధానికి, పరస్పర విశ్వాసానికి ఈ కార్యక్రమం అద్దం పట్టింది.




## రాజీవ్ గాంధీ విగ్రహం ధ్వంసం చేసిన నిందితులను అరెస్ట్ చేయాలి:

**రాజమహేంద్రవరం: జయ జయహే :ఆగష్టు 28:**

జాంపేట వంతెన సమీపంలోని మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం చేతిని ధ్వంసం చేసిన ఘటనను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. నిందితులను గుర్తించి 15 రోజుల్లోగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కాంగ్రెస్ రాజమండ్రి పార్లమెంట్ కోఆర్డినేటర్ టీకే విశ్వేశ్వర రెడ్డి, అర్బన్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ తెలిపారు. పోలీసులు స్పందించకపోతే విగ్రహం వద్దే నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు.

రాజమహేంద్రవరంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన వారు, ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. గోదావరి పుష్కరాల నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని, ప్రజాస్వామ్య విలువలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజీవ్ గాంధీ దేశంలో ఐటీ రంగ అభివృద్ధికి చేసిన సేవలను గుర్తుచేస్తూ ఆయన విగ్రహం ధ్వంసం చేయడం బాధాకరమన్నారు. సమావేశంలోపాల్గొన్నవారు పిసిసి ఉపాధ్యక్షుడు ఎస్. మార్టిన్ లూథర్, డాక్టర్ రాజశేఖర్, తాడి సూరిబాబు, బత్తిన చంద్రరావు, బర్రె సుబ్రహ్మణ్యం, సింధియా రాణి, నిల్లా వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.



## ఏసీబీ వల్లలో చిక్కిన అవినీతి చేప

### విశ్రాంతి ఉద్యోగం నుండి రూ. 50 వేలు డిమాండ్ .

### ఏసీబీ అధికారులను ఆశ్రయించిన విశ్రాంతి ఉద్యోగి .

**జయ జయహే - నర్సీపట్నం :**

ఏసీబీ వల్లలో చిక్కిన అవినీతి చేప. లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు అడ్డంగా దొరికిపోయిన నర్సీపట్నం డివిజనల్ ఉపఖజాన కార్యాలయంలోని సీనియర్ అకౌంటెంట్ విజయభాస్కర్. ఇటీవల గొలుగొండ మండల తహశీల్దారుగా విధులు నిర్వహించి ఉద్యోగ విమరణ పొందిన శ్రీనివాస్ కు సంబంధించిన ఇంక్రిమెంట్ , ఏరియాస్ కు బిల్లు పెట్టగా నర్సీపట్నం డివిజనల్ ఉపఖజాన కార్యాలయంలోనిసీనియర్ అకౌంటెంట్ విజయభాస్కర్ రూ. 50 వేలు రూపాయలు లంచం డిమాండ్ చేసినట్లు తెలిపారు. లంచం ఇవ్వకపోవడంతో విశ్రాంతి ఉద్యోగికి చెందిన ఫైల్‌ను తిరస్కరించడం జరిగిందన్నారు. దీంతో విశ్రాంతి ఉద్యోగి శ్రీనివాస్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసిబి అడిషనల్ ఎస్పీ హర్షిత ఆధ్వర్యంలో డిఎస్పి రమణమూర్తి , పృథ్వీరాజ్ నేతృత్వంలో పక్క ప్రణాళికలతో నర్సీపట్నం డివిజనల్ ఉప ఖజానా కార్యాలయంలో విశ్రాంతి ఉద్యోగి తహశీల్దారు శ్రీనివాస్ నుండి సీనియర్ అకౌంటెంట్ విజయ భాస్కర్ రూ. 30 వేలు నగదు స్వీకరిస్తుండగా రెడ్ హ్యాండ్ గా ఏసీబీ అధికారులకు పట్టుపడ్డాడు. పట్టుబడిన విజయభాస్కర్ ను విచారణ చేపట్టిన అనంతరం వారి గృహానికి వెళ్లి తనిఖీ చేసినట్టు ఏసీబీ అధికారులు తెలియజేశారు. నిందితుడును విశాఖపట్నం ఏసీబీ కోర్టులో హాజరు పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం అడిగిన , డిమాండ్ చేసిన బాధితులు భయపడకుండా ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ అమరవీరుల త్యాగాలను వృధా కానివ్వం

**అనకాపల్లి జయ జయహే**



బషీర్ బాగ్ విద్యుత్ పోరాటంలో 2000 ఆగస్టు 28 న జరిగిన కాలపుల్లో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల 26వ సంస్మరణ సభ శుక్రవారం అనకాపల్లి మెయిన్ రోడ్డు బాటా సెంటర్లో నిర్వహించడం జరిగింది సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె లోకనాథం సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసే నివాళులు ఘటించారు ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ 2000 ఆగస్టు 28న పెంచిన విద్యుత్తు చార్జీలను తగ్గించాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించిన చలో హైదరాబాద్ కార్యక్రమం సందర్భంగా బషీర్బాగులో నిర్వహించిన ధర్నాలో చంద్రబాబు ప్రభుత్వం అత్యంత కిరాతగంగా కాల్పులు జరిపిందన్నారు ఈ కాల్పుల్లో కామ్రేడ్ రామకృష్ణ విష్ణువర్ధన్ బాలస్వామి ఈ ముగ్గురు కామ్రేడ్లు చనిపోగా చాలామంది పోరాటంలో పాల్గొన్న రైతులు కార్మికులు ప్రజలు ఆనాటి పోరాటంలో మరణించడం జరిగింది అని ఆయన అన్నారు చంద్రబాబు ప్రభుత్వం అమలు చేసిన విద్యుత్ సంస్కరణ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాయని ఆ ఉద్యమ ఫలితంగానే చంద్రబాబు అప్పటిఎన్నికలలో గద్దె దించారని ఆయన గుర్తు చేశారు అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 10 ఏళ్ళు విద్యుత్ ఛార్జీలు పెంచడానికి సహకరించలేదని అయితే ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆదేశాలకు లొంగి రాష్ట్రంలోని నివాస గృహాలకు విద్యుత్తు ప్రీపైడ్ స్మార్ట్ మీటర్లు వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు ఏర్పాటు చేయాలని గత వైసిపి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు ఆదాని, శిరిడి సాయి తదితర కంపెనీలకు స్మార్ట్ మీటర్లు కాంట్రాక్ట్ వర్క్ కట్టబెట్టిందని ఆయన విమర్శించారు తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఈ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేసిందని ఆయన గుర్తు చేశారు అయితే నేడు తెలుగుదేశం ఓటమి ప్రభుత్వ అధికారంలో వచ్చిన తర్వాత ఆ ఒప్పందాలు రద్దు చేయకపోగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ప్రక్రియను మరింత వేగవంతం చేయడంపై ఆయన మండిపడ్డారు మొదటి దశలో వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు ఏర్పాటు చేయడం ద్వారా క్రమంగా ఉచిత విద్యుత్తుకు వేసరుపెట్టే ప్రమాదం ఉందన్నారు అదేవిధంగా నివాస గృహాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం వల్ల ప్రీపెయిడ్ పద్ధతి విద్యుత్ వినియోగ సమయాన్ని బట్టి ఆధునిక చార్జీలు మీటర్ల ఖర్చులు వినియోగదారులపై మోపడం వలన వివిధ రూపాల్లో ప్రజలపై అదనపు హార్దిక భారం పడే అవకాశం ఉందన్నారు స్మార్ట్ మీటర్ల పేరుతో వేలాది కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని వారు ఆరోపించారు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించిన ఆయన ఎప్పుడు స్మార్ట్ మీటర్ల విధానాన్ని అధికారంలో వచ్చిన తర్వాత కొనసాగించడం తెలుగుదేశం చేసిన వాగ్దానం తప్పడమే అని ఆయన విమర్శించారు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వ్యవసాయ పంపు చెట్లుకు నివాస గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియ నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు అమరవీరుల త్యాగాలను వృధా కానివ్వకుండా ప్రజలు ప్రయోజనాలను కాపాడేందుకు ఉద్యమాలను మరి అంత బలోపేతం చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు బీ ఉ మామహేశ్వర రావు కె తేలయ్య బాబు వర్కర్స్ యూనియన్ నాయకులు బీసెట్టి అప్పారావు సిపిఐ పార్టీ నాయకులు కోరుబిల్లి శంకర్రావు కోన లక్ష్మణ విత్తనాల పోతురాజు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# ఆదర్శంగా నిలిచిన జిల్లా కలెక్టర్

**తిరుపతి,ఆగస్టు 28, జయ జయహే**

తిరుపతి మాదక ద్రవ్యాల నిర్మూలన పై తిరుపతి తారకరామా స్టేడియం నుంచి టౌన్ క్లబ్ సర్కిల్ వరకు నిర్వహించిన భారీ అవగాహన ర్యాలీ అనంతరం రోడ్డు పై పడిన చెత్త, వాటర్ బాటిళ్లను జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ స్వయంగా పక్కకు తొలగించారు. పారిశుధ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని చాటి చెప్పేలా కలెక్టర్ స్వయంగా చెత్తను తొలగించడం పలువురిని ఆకట్టుకుంది.



# ఐదు కిలోల గంజాయి పట్టివేత

**మాడుగుల ఆగస్టు 28 జయ జయహే**

మాడుగుల మండలం కోడూరు గ్రామ శివార్లలో మాడుగుల పోలీసులు శుక్రవారం ఐదు కిలోలు గంజాయిని పట్టుకున్నారు. మహారాష్ట్ర కు చెందిన ఇద్దరు వ్యక్తులు 5 కేజీల గంజాయి ని ఒరిస్సా రాష్ట్రంలో పాడువ ప్రాంతంలో కొనుగోలు చేసి పూణే పరిసర ప్రాంతాల్లో అమ్ముకోవడానికి తీసుకొని వెళ్తుండగా మాడుగుల పోలీస్ లకు పట్టుబడ్డారు. దానిపై గంజాయి కేసు నమోదు చేసి ఇద్దరు ముద్దాయిలు ను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం చోడవరం కోర్టు కు తరలించినట్టు ఎస్సై నారాయణరావు తెలిపారు



# పేదలకు అన్నదానం

**మాడుగుల ఆగస్టు 28 జయ జయహే**

మూడోశ్రావణ శుక్రవారం సందర్భంగా మాడుగుల బస్టాండ్ ఆవరణలో గల శ్రీ దేవి ఆలయంలో స్థానిక న్యాయవాదులు శ్రీనాదు ప్రసాదరావు, ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో పేదలకు అన్న సమారాధన కార్యక్రమం చేపట్టారు. గత 9 సంవత్సరాలనుండి వీరు శ్రావణమాసంలో ప్రతి శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఉంటారు దానిలో భాగంగా ఈ ఏడాది కూడా ఈ కార్యక్రమం కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రతినిధులు జై వరహాలు, జి జగన్నాథరావు, ఏ ఎన్ వి ప్రసాద్, పి సోమేష్, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కర్ణాటక ఆర్టీసీ బస్సు

## 16 మందికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం

**నాయుడుపేట,ఆగస్టు 28, జయ జయహే**

నాయుడుపేట జాతీయ రహదారిపై మరమ్మతులకు గురై రోడ్డు పక్కన ఆగి ఉన్న కట్టెల లోడు లారీని కర్ణాటక ఆర్టీసీ వోల్వో బస్సు వెనుక నుంచి ఢీకొన్న ఘటన శుక్రవారం తెల్లవారుజామున తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం చంబడిపాలెం జాతీయ రహదారిపై చోటుచేసుకుంది.పోలీసుల వివరాల మేరకు బెంగళూరు నుంచి నెల్లూరుకు 16 మంది ప్రయాణికులతో కర్ణాటక ఆర్టీసీ బస్సు బయలుదేరింది. చంబడిపాలెం వద్దకు చేరుకునే సరికి రోడ్డు పక్కన కట్టెల లోడుతో మరమ్మతులకు గురై ఆగి ఉన్న లారీని బస్సు వేగంగా వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తో పాటు 16 మంది ప్రయాణికులు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పెళ్లకూరు ఎస్సై ఆదిలక్ష్మి పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనాల్లో నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన అనంతరం ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.ప్రమాదంలో చిన్నారులు కూడా గాయపడటంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. గాయపడిన తల్లిదండ్రులను చూసి చిన్నారులు ఏడుస్తుండటం అక్కడి వారిని కంటతడి పెట్టించింది. ఈ ఘటన పై పెళ్లకూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు ప్రమాదానికి గల కారణాల పై ఆరా తీస్తున్నారు.




# సెప్టెంబర్ 4న గోకులాష్టమి వేడుకలు

**కర్నూలు (జయ జయహే)**

గోకులాష్టమిని పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 4న జూపాడు బంగ్లా మండలం, పారుమంచాల గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం నందు గోపూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్యానర్ ను స్థానిక భక్త సమాజంతో కలిసి ఆవిష్కరించారు. గోవు యొక్క విశిష్టత, గో సంరక్షణ ఆవశ్యకత తెలుపుటకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక అర్చకులు సునీలాచార్యులు, స్థానిక ఆలయాల నిర్వాహకులు పోచ లోకేశ్వర రెడ్డి, భజన మండలి అధ్యక్షులు మండ్ల రాము, భజనమండలి సభ్యులు నారాయణరెడ్డి,జనార్దన్ రెడ్డి, దివాకరరెడ్డి వెంకటస్వామి, పాపయ్యాచారి, మధు, శివ, మద్దిలేటి, చెన్నప్ప, పుల్లయ్య, ప్రవీణ్, ఆంజనేయులు, మధు కుమారి, తదితరులు పాల్గొన్నారు.

# గాజుల అలంకారంతో కనువిందు చేస్తున్న నూకంబిక అమ్మవారు

**అనకాపల్లి జయ జయహే**



స్థానిక గవరపాలెంలో వేంచేసి ఉన్న ఉత్తరాంధ్ర ఇలవేల్పు ఆరాధ్య దైవమైన శ్రీశ్రీశ్రీ నూకాంబిక అమ్మవారికి మూడో శుక్రవారం శ్రావణమాసం పురస్కరించుకుని లక్ష గాజులతో అమ్మవారికి అలంకరించడం జరిగింది అలాగే దేవాలయంలో మహిళలచే కుంకుమ పూజలు నిర్వహింప చేయడం జరిగింది అధిక సంఖ్యలో మహిళలు కుంకుమ పూజల పాల్గొని అమ్మవారిని దర్శించడం జరిగింది ఆలయ పాలకవర్గ సభ్యులు మహిళలకు కుంకుమ పూజకు అన్ని పూజా ద్రవ్యములు ఏర్పాటు చేయడం జరిగింది ఆలయ చైర్మన్ పీల నాగ శ్రీను (గొల్ల బాబు) పాలకవర్గ సభ్యులు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు




# మృత్యు అంచుల్లో బాలింత.. ఎక్మోతో ప్రాణాలు కాపాడిన యశోద వైద్యులు

**రాజమహేంద్రవరం జయ జయహే ప్రతినిధి:**

ప్రసవ సమయంలో గుండె ఆగిపోయి, బహుళ అవయవాల వైఫల్యంతో అత్యంత విషమ పరిస్థితికి చేరుకున్న 23 ఏళ్ల బాలింతకు హైదరాబాద్ యశోద హైటెక్ సిటీ ఆసుపత్రి వైద్యులు అత్యాధునిక ఎక్మో చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. పెరిపార్టమ్ కార్డియోమయోపతి కారణంగా గుండె పనితీరు పూర్తిగా దెబ్బతినడంతో పరిస్థితి విషమించింది. ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ దామోదర్ రెడ్డి గౌని నేతృత్వంలో కార్డియాలజీ, క్రిటికల్ కేర్, ప్రసూతి, నెఫ్రాలజీ తదితర విభాగాల వైద్యులు సమన్వయంతో చికిత్స అందించారు. సకాలంలో ఎక్మోను ఉపయోగించడంతో బాలింత ప్రాణాపాయం నుంచి బయటపడి పూర్తిగా కోలుకున్నారు. ప్రస్తుతం తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఈ అరుదైన వైద్య విజయ వివరాలను రాజమండ్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ దామోదర్ రెడ్డి గౌని, ఏపీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వి. సాయి కిరణ్ వెల్లడించారు.

# విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్‌పై ప్రత్యేక శిక్షణ

**చోడవరం, ఆగస్టు 28 జయ జయహే**



స్థానిక ఉషోదయ విద్యాసంస్థల్లో డిగ్రీ విద్యను అభ్యసిస్తున్న 100 మంది విద్యార్థులకు గత పది రోజులుగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో, నాంది ఫౌండేషన్ సహకారంతో సాఫ్ట్ స్కిల్స్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణలో భాగంగా ట్రైనర్లు సౌమ్య, నిరుపమ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూలను సమర్థవంతంగా ఎదుర్కోవడం, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడం తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ అందించారు. విద్యార్థులు భవిష్యత్తులో స్వయం ప్రతిభతో ఎదిగి, ఉన్నత విద్యా మరియు ఉపాధి అవకాశాలను సాధించేలా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ పట్ల విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో ఉన్నత విద్యా అవకాశాలను, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జే. రమణాజీ మాట్లాడుతూ, విద్యార్థుల జీవితంలో చదువుకు ఎంత ప్రాధాన్యత ఉందో, వారి భవిష్యత్ కెరీర్‌కు కూడా అంతే ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో విద్యతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ద్వారా మెరుగైన భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామని తెలిపారు. ఉషోదయ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ మెంబర్ జే. శ్యామ్ జీ మాట్లాడుతూ, "ఉషోదయ విద్యాసంస్థల్లో డిగ్రీ చదువుతున్న విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాము. ముఖ్యంగా ద్వితీయ సంవత్సరం, తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఉద్యోగ ఇంటర్వ్యూలను ధైర్యంగా ఎదుర్కొనేలా, ఉపాధి అవకాశాలను సాధించేలా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాము" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ విద్యాసంస్థల కరస్పాండెంట్ జే. కృష్ణకుమారి, డీన్ ఎస్.వి. వాసు, ప్రిన్సిపల్ ఎస్.ఎన్. నాయుడు, వైస్ ప్రిన్సిపల్ పి. దొరబాబుతో పాటు అధ్యాపక బృందం పాల్గొని, శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

# సెప్టెంబర్ 2 నుంచి ఆర్మీ నియామక ర్యాలీ

**- పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆదేశం**

**- హాజరు కానున్న 10,350 మంది అభ్యర్థులు**

**విశాఖపట్నం, ఆగస్టు 28, జయ జయహే**



అగ్నివీర్ పథకం కింద సెప్టెంబర్ 2 అర్ధరాత్రి నుంచి 20వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్న ఆర్మీ నియామక ర్యాలీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ర్యాలీ నిర్వహించడంతో పాటు ఆర్.కె. బీచ్ రోడ్డులోని ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి 1.6 కిలోమీటర్ల రన్నింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఏపీలోని అన్ని జిల్లాల నుంచి సుమారు 10,350 మంది అభ్యర్థులు హాజరు కానున్న నేపథ్యంలో అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ర్యాలీ సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్, వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ఇద్దరు నోడల్ అధికారులను నియమించారు. ర్యాలీ ప్రాంగణంలో పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, లైటింగ్, బారికేడింగ్, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలను సమకూర్చాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. అభ్యర్థుల రాకపోకలకు అంతరాయం లేకుండా ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లను పటిష్టం చేయాలని పోలీస్ శాఖకు సూచించారు. వైద్య అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ర్యాలీ ప్రాంగణం, రన్నింగ్ సైట్ వద్ద వైద్య బృందాలు, అంబులెన్సులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అగ్నిప్రమాద నివారణ చర్యల్లో భాగంగా ఫైర్ టెండర్‌ను, విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. ర్యాలీకి సంబంధించిన తేదీలు, అర్హతలు, వేదిక, ఇతర సూచనలను ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలకు అప్పగించిన పనులను ర్యాలీ ప్రారంభానికి ముందే పూర్తి చేసి, లోటుపాట్లు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్మీ రిక్రూట్మెంట్ అధికారి, కల్నల్ అమరేష్ సింగ్, ఇంచార్జి డీఆర్వో టి. గోవిందు, పోలీస్, రెవెన్యూ, విద్యుత్, వైద్యారోగ్య శాఖ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సోదర సంస్కృతికి ప్రతిబింబం...రక్షాబంధన్!

**విశాఖపట్నం, ఆగస్టు 28, జయ జయహే :**




శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, విశాఖ జిల్లా మహిళా యూత్ వింగ్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మానసా డిఫెన్స్ అకాడమీలో రక్షాబంధన్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత రెండు సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ సేవా కార్యక్రమంలో ఈ ఏడాది 14 మంది మహిళా యూత్ సభ్యులు పాల్గొని, విద్యార్థులకు ఆత్మీయంగా రాఖీలు కట్టారు. రాఖీ బంధం ద్వారా సోదరభావం, పరస్పర ప్రేమ, సేవా స్ఫూర్తి, దేశభక్తి వంటి ఉన్నతమైన విలువలను విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా మానసా డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ రాంభీర్ సింగ్ రావత్ మాట్లాడుతూ సోదర, సోదరీమణుల మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రతిబింబించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన శ్రీ సత్యసాయి మహిళా యూత్ సభ్యుల సేవా స్ఫూర్తిని అభినందించారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థలు చేపడుతున్న సేవా కార్యక్రమాల స్ఫూర్తికి అనుగుణంగా, రక్షాబంధన్‌ను కేవలం ఒక పండుగగా కాకుండా ప్రేమ, సోదరభావం, సేవ మరియు దేశభక్తి విలువలను పంచుకునే పవిత్ర సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన అకాడమీ యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు మరియు శ్రీ సత్యసాయి మహిళా యూత్ సభ్యులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు



## శ్రీ ప్రకాష్‌లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

**పాయకరావుపేట జయ జయహే**

తెలుగు భాషా పరిరక్షణకు విశేష కృషి చేసిన మహనీయుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని, శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల ఆవరణలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ గేయ రచయిత మరియు అష్టావధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, తెలుగు పద్యాలను చదవడం, తెలుగులో మాట్లాడటం ద్వారా మన భాషపై అభిమానం, మక్కువ మరింత పెరుగుతాయని అన్నారు. మాతృభాషను మరచిపోకుండా, తెలుగు భాషను భావితరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. మాతృభాషా మాధ్యమం ద్వారా నేర్చుకున్న విషయాలను జీవితాంతం మర్చిపోలేమని, మాతృభాషకు ఉన్న ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బాల గేయాలు, పద్య పఠనం, వక్తృత్వం, కథా రచన మరియు క్విజ్ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్య అతిథి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల ప్రధానోపాధ్యాయులు, తెలుగు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

## ఏ పాత్రనైనా తనదైన శైలిలో నటించే నటులు సుమన్

**భీమవరం : (జయ జయహే)**



సుమన్ యాక్షన్ హీరోగా వెండి తెరపై అడుగు పెట్టి హీరో, సహాయ నటుడు, విలన్ ఇలా ఏ పాత్రనైనా సరే సుమన్ తనదైన శైలి నటిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారని అఖిల భారత శోభన్ బాబు సేవా సమితి కన్వీనర్ భట్టిప్రోలు శ్రీనివాసరావు (బిఎస్ఆర్) అన్నారు. సుమన్ పుట్టినరోజు సందర్భంగా ఆయనతో తనకు అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ సుమన్ మరెన్నో పుట్టినరోజు వేడుకలను జరుపుకోవాలని కోరుకుంటున్నానని శ్రీనివాస రావు అన్నారు. సుమన్ అన్నమయ్య సినిమాలో 'వేంకటేశ్వర స్వామి' గా, రామదాసులో శ్రీరాముడిగా నటించి తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువయ్యారని, శివాజీ సినిమాలో సుమన్ పండించిన విలనిజం మంచి గుర్తింపు సొంతం చేసుకుందన్నారు. సుమన్ ఇప్పటి వరకూ తెలుగు, తమిళ, కన్నడ, ఆంగ్ల భాషలలో 710కి పైగా చిత్రాల్లో నటించారని, ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్టుగా కథా ప్రాధాన్యమున్న పాత్రలను ఎంపిక చేసుకుని నటిస్తున్నారన్నారు. దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని సుమన్ అందుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు.



## రాఖీ పౌర్ణమి వేళ ఆత్మీయ అనుబంధం

**అచ్చుతాపురం, ఆగస్టు 28, జయ జయహే:**

ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఏటికొప్పాకలో రాఖీ పండుగ సందర్భంగా శుక్రవారం రాఖీ పౌర్ణమి వేళ ఆత్మీయ అనుబంధం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ కు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ రాఖీ కట్టి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ రాఖీ పండుగ సోదర, సోదరీమణులకు ఎంతో ఆత్మీయతను ఇచ్చి అభిమానం ఆప్యాయతలను బహిర్గతం చేసే పండుగని అభినందించారు. సోదరీమణు సమానురాలైన జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణ విజయ పదంలో నడిపించేందుకు ఆమె చేస్తున్న కృషి ఎంతగానో సఫలీకృతం అవుతుందని అభినందించారు.



## విద్యతో పాటు క్రీడలు యోగపై అవగాహన

**మునగపాక, ఆగస్టు 28, జయ జయహే:**

విద్యతో పాటు క్రీడలు యోగపై అవగాహన పెంచుకోవడం ద్వారా విద్యార్థులకు ఎన్నో లాభాలు ఉంటాయి అని యోగా టీచర్ జగన్ అన్నారు. చంద్రశేఖర్ మహాస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రం మండలంలో నాగులపల్లి ఆధ్వర్యంలో నాగులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కే.శంకర్రావు సమక్షంలో ధ్యాన గురువు సుజాత ఆధ్వర్యంలో యోగా టీచర్లు జగన్, సౌమ్య, వైష్ణవి, అమ్మాజమ్మ విద్యార్థులకు యోగ పై అవగాహన కల్పించారు. ఆరోగ్యంగా ఎదగడానికి, ఏకాగ్రత పెరగడానికి, జ్ఞాపకశక్తి పెరగడానికి, పలు యోగ ప్రక్రియలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల ఆసక్తిగా యోగా నేర్చుకోవడానికి శ్రద్ధ కనబరిచారు. శుక్రవారం నాగులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ యోగా కార్యక్రమం జరిగింది.



## శ్రీకాళహస్తిలో ఘనంగా అయ్యప్ప స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకం

**శ్రీకాళహస్తి,ఆగస్టు 28, జయ జయహే**

శ్రీకాళహస్తి పట్టణంలో మొట్టమొదటిసారిగా నిర్మించిన ఓం శ్రీ హరి హర సుత ధర్మశాస్త్ర నూతన అయ్యప్ప స్వామి వారి ఆలయ నిర్మాణం పూర్తయిన సందర్భంగా శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శబరిమల పందల రాజవంశస్థులు సురేష్ వర్మ, శబరిమల మాజీ మెల్ శాంతి బ్రహ్మశ్రీ శంకరం నంబూద్రి హాజరయ్యారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ అయ్యప్ప స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయంలో కుంభాభిషేక మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం అయ్యప్ప స్వామి భక్తులతో కిక్కిరిసింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పరిసరాలు అయ్యప్ప నామస్మరణతో మార్మోగాయి. శబరిమల అయ్యప్ప స్వామి వారి తత్వమసి సేవా సమితి రిజిస్ట్రేషన్ నం. 74/2026 ఎస్.ఏ.ఎస్.వీ.టి.ఎస్.ఎస్ కమిటీ సభ్యులు, నిర్వాహకులు ఈ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు, అయ్యప్ప స్వామి భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.



## శ్రీకాళహస్తి సబ్‌జైలులో జూనియర్ సివిల్ జడ్జి ఆకస్మిక తనిఖీ

**శ్రీకాళహస్తి,ఆగస్టు 28, జయ జయహే**

శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా జడ్జి ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి పట్టణంలోని సబ్‌జైలును జూనియర్ సివిల్ జడ్జి వెంకట నాగరాజు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌జైలు పరిసర ప్రాంతాలు, బాత్‌రూమ్‌లు, ముద్దాయిలు నివసిస్తున్న ప్రదేశాలను పరిశీలించారు. జైలులో పరిశుభ్రత, పారిశుద్ధ్య పరిస్థితులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముద్దాయిలతో జడ్జి వెంకట నాగరాజు మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిశుభ్రత పాటించడంతో పాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే వాటిని అర్జీ రూపంలో అందజేయాలని తెలిపారు. ఈ ఆకస్మిక తనిఖీలో సబ్‌జైలు సిబ్బంది, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.



## ఫిన్లాండ్‌లో నిర్వహించిన శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన ఉపాధ్యాయుడు

**తొట్టంబేడు,ఆగస్టు 28, జయ జయహే**

తొట్టంబేడు మండలం దిగువ సాంబయ్యపాళెం ఫౌండేషన్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కయ్యూరు బాలసుబ్రమణ్యం ఫిన్లాండ్‌లోని టుర్కు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన వృత్తిపరమైన శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. త్రూ జాయ్ అండ్ ప్లే పేరుతో బాల్యదశ మరియు ప్రాథమిక విద్యలో బోధనా విధానాలపై ఈ శిక్షణా కార్యక్రమాన్ని 2026 జూన్ 12 నుంచి 16 వరకు, అలాగే ఆగస్టు 17 నుంచి 26 వరకు నిర్వహించారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన బాలసుబ్రమణ్యంకు కార్యక్రమ నిర్వాహకులు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యా కమిషనర్ తమీమ్ అన్సారియా, టుర్కు విశ్వవిద్యాలయానికి చెందిన సువి పువోలక్కా, ప్రాథమిక విద్యా విభాగ ప్రధానాచార్యులు, రౌమా టీచర్ ట్రైనింగ్ స్కూల్ ప్రతినిధులు, టుర్కు విశ్వవిద్యాలయం అంతర్జాతీయ అభివృద్ధి మేనేజర్ బాల్యదశ విద్య మరియు సంరక్షణ సారీ ఐసోక్యోటో సింజోయ్ తదితరులు పాల్గొన్నారు. బాల్యదశలో విద్యార్థులకు ఆనందం, ఆటల ద్వారా బోధన అందించడం, ప్రాథమిక విద్యలో నూతన బోధనా పద్ధతులను అమలు చేయడం వంటి అంశాలపై శిక్షణలో అవగాహన కల్పించినట్లు తెలిపారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన బాలసుబ్రమణ్యంను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

# సౌర విద్యుత్...వర్చువల్ నెట్ మీటరింగ్‌పై అవగాహన కల్పించాలి

**మౌలిక వసతుల కల్పన కోసం 1,900 కోట్లు**

**- డిజిటల్ చెల్లింపులు, ముందస్తు కమ్యూనికేషన్‌పై ప్రత్యేక దృష్టి**

**-ఉన్నత స్థాయి వర్క్‌షాప్‌లో ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్**

**విశాఖపట్నం, ఆగస్టు 28, జయ జయహే**




రాష్ట్రంలో సౌర విద్యుత్ వినియోగాన్ని మరింత విస్తృతం చేయడంతో పాటు వర్చువల్ నెట్ మీటరింగ్ విధానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ అధికారులను ఆదేశించారు. ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఉన్నత స్థాయి అధికారుల వర్క్‌షాప్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 'ప్రధానమంత్రి సూర్యఘర' పథకంలో అందిస్తున్న సబ్సిడీతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ. 20 వేల అదనపు సబ్సిడీ ప్రయోజనాలను అర్హులైన ప్రతి బీసీ వినియోగదారునికి చేరవేయాలని సూచించారు. దేశంలో వర్చువల్ నెట్ మీటరింగ్ నిబంధనలను అమలు చేసిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మొదటిదని తెలిపారు. ముఖ్యంగా అపార్ట్‌మెంట్లు, గ్రూప్ హౌసింగ్ సొసైటీలలో నివసించే ప్రజలు రూఫ్‌టాప్ సోలార్‌ను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు ఈ విధానం ఎంతో దోహదపడుతుందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30 లక్షల గృహాల్లో సౌర విద్యుత్ వ్యవస్థలను ప్రోత్సహించడం ద్వారా విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. విద్యుత్ సరఫరా నాణ్యత, విశ్వసనీయతను పెంచేందుకు సంస్థ దాదాపు 1,800 నుండి 1,900 కోట్ల రూపాయల భారీ మూలధన వ్యయాన్ని వెచ్చిస్తోందని తెలిపారు. కొత్త సబ్‌స్టేషన్లు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, విశాఖ లాంటి నగరాల్లో భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థ వంటి మౌలిక వసతుల అభివృద్ధితో కలిగే ప్రయోజనాలను వినియోగదారులకు తెలియచేయాలని సూచించారు. విద్యుత్ బిల్లుల చెల్లింపుల్లో డిజిటల్ విధానాలను మరింత పెంచాలని, ప్రస్తుతం ఆఫ్‌లైన్ ద్వారా జరుగుతున్న 25శాతం చెల్లింపులను పట్టణ మరియు మున్సిపల్ ప్రాంతాల్లో దాదాపు సున్నాకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించారు. 'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ సేవలు, యూపీఐ, క్యూఆర్ కోడ్ చెల్లింపులపై గ్రామ స్థాయి వరకు విస్తృత ప్రచారాన్ని నిర్వహించి డిజిటల్ చెల్లింపుల శాతాన్ని 90శాతం కంటే ఎక్కువ స్థాయికి తీసుకెళ్లాలని ఆదేశించారు. ఈ రెండు రోజుల వర్క్‌షాప్‌లో సౌర విద్యుత్ విస్తరణ, వర్చువల్ నెట్ మీటరింగ్ అమలు, వినియోగదారుల కమ్యూనికేషన్ వ్యూహాలు, డిజిటల్ చెల్లింపుల పెంపు మరియు డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ నిర్వహణపై సాంకేతిక, నిర్వహణ అంశాలపై అధికారులు సుదీర్ఘంగా చర్చించనున్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్ టి.వి. సూర్యప్రకాష్, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ హెచఆర్‌డీ టి. వనజ, డైరెక్టర్ ఫైనాన్స్ ఎస్. హరిబాబు, సీజీఎంలు వి. విజయలలిత, డి. సుమన్ కళ్యాణి, ఎస్. రాజబాబు, ఎల్. మహేంద్రనాథ్, బి. అశోక్ కుమార్, ఎస్. విజయప్రతాప్, పి. వెంకటేశ్వరరావు, పి. సోల్మన్ రాజు, జిఎంలు, 11 సర్కిళ్లకు చెందిన సూపరింటెండింగ్ ఇంజినీర్లు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## సెప్టెంబర్ 2 నుంచీ ఆర్మీ నియామక ర్యాలీ

**పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆదేశం**

**హాజరు కానున్న 10,350 మంది అభ్యర్థులు**

**విశాఖపట్నం, ఆగస్టు 28, జయ జయహే**

అగ్నివీర్ పథకం కింద సెప్టెంబర్ 2 అర్ధరాత్రి నుంచి 20వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్న ఆర్మీ నియామక ర్యాలీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ర్యాలీ నిర్వహించడంతో పాటు ఆర్.కె. బీచ్ రోడ్డులోని ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి 1.6 కిలోమీటర్ల రన్నింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఏపీలోని అన్ని జిల్లాల నుంచి సుమారు 10,350 మంది అభ్యర్థులు హాజరు కానున్న నేపథ్యంలో అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ర్యాలీ సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్, వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ఇద్దరు నోడల్ అధికారులను నియమించారు. ర్యాలీ ప్రాంగణంలో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, లైటింగ్, బారికేడింగ్, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలను సమకూర్చాలని జీవీఎంసి అధికారులను ఆదేశించారు. అభ్యర్థుల రాకపోకలకు అంతరాయం లేకుండా ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లను పటిష్టం చేయాలని పోలీస్ శాఖకు సూచించారు. వైద్య అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ర్యాలీ ప్రాంగణం, రన్నింగ్ సైట్ వద్ద వైద్య బృందాలు, అంబులెన్సులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అగ్నిప్రమాద నివారణ చర్యల్లో భాగంగా ఫైర్ టెండర్‌ను, విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. ర్యాలీకి సంబంధించిన తేదీలు, అర్హతలు, వేదిక, ఇతర సూచనలను ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలకు అప్పగించిన పనులను ర్యాలీ ప్రారంభానికి ముందే పూర్తి చేసి, లోటుపాట్లు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్మీ రిక్రూట్మెంట్ అధికారి, కల్నల్ అమరేష్ సింగ్, ఇంచార్జి డీఆర్వో టి. గోవిందు, పోలీస్, రెవెన్యూ, విద్యుత్, వైద్యారోగ్య శాఖ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 31న మంప సచివాలయంలో పీజీఆర్ఎస్...

**కొయ్యూరు : (జయ జయహే ) న్యూస్ ఆగష్టు 29,**

ఈ నెల 31న సోమవారం ఉదయం 10 గంటల నుండి మండలంలోని మంప గ్రామ సచివాలయంలో పీజీఆర్ఎస్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జీడీవీ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికను చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, ముఖ్యంగా రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న వ్యక్తిగత, సామాజిక సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. ఉన్నతాధికారులు ఎంతో సదుద్దేశంతో నిర్వహిస్తున్న ఈ పీజీఆర్ఎస్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవడానికి ముందుకు రావాలని ఎంపీడీవో పిలుపునిచ్చారు.




## ఫిన్లాండ్ విద్యా విధానం సూపర్..!

**రోలుగుంట జెడ్పీ స్కూల్ ఉపాధ్యాయురాలు నాగజ్యోతి**

**చోడవరం, ఆగస్టు 28, జయ, జయహే:**




ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఫిన్లాండ్ విద్యా పర్యటనకు అనకాపల్లి జిల్లా రోలుగుంట పీఎం శ్రీ జెడ్పీ ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ పి.వి.ఎం. నాగజ్యోతి వెళ్లారు. పర్యటన ముగించుకుని ఇటీవల రోలుగుంట చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'విదేశీ విద్యావ్యవస్థను కేవలం పరిశీలించడం మాత్రమే కాకుండా, అక్కడి ఉత్తమ బోధనా పద్ధతులను మన విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మలచుకుని, పాఠశాలల్లో అమలు చేయడమే ఈ పర్యటన ప్రధాన లక్ష్యం" అని పేర్కొన్నారు. 28సంవత్సరాల బోధనా అనుభవం, వినూత్న బోధనా పద్ధతులు, విద్యార్థి కేంద్రిత అభ్యసనం, సాంకేతికత వినియోగం, ఆనందదాయక విద్యపై ప్రత్యేక దృష్టితో పనిచేస్తున్న తాను ఫిన్లాండ్ విద్యా పర్యటన ద్వారా తన బోధనా అనుభవాలను మరింత విస్తరించుకున్నానన్నారు. తనకు అంతర్జాతీయ విద్యా అధ్యయన అవకాశాన్ని కల్పించిన సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ కి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర విద్యా వ్యవస్థలో ఫిన్లాండ్ ఉత్తమ విద్యా విధానాలను అన్వయించి, విద్యార్థులకు మరింత మెరుగైన అభ్యసన అవకాశాలు కల్పించేందుకు ఈ అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు. ఫిన్లాండ్‌లో తన ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని ఉపాధ్యాయుల సృజనాత్మకత, వినూత్న ఆలోచనలు, విద్యార్థుల అభ్యసనంపై ఉన్న నిబద్ధతను చాటిన నాగజ్యోతి పలువురి ప్రశంసలు అందుకోవడం విశేషం.

## గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరు నిందితులకు 10 ఏళ్లు జైలు శిక్ష

**చోడవరం, ఆగస్టు 28: జయ జయహే**



అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో 435 కిలోల గంజాయి అక్రమ రవాణాకు సంబంధించిన కేసులో ఏ2, ఏ3 నిందితులకు చెరో 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1 లక్ష జరిమానా విధిస్తూ చోడవరం 9వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానం శుక్రవారం తీర్పు వెలువరించింది. కేసు వివరాలు పరిశీలిస్తే..2016 జనవరి 19న మధ్యాహ్నం 1 గంట సమయంలో పెదబయలు నుంచి కృష్ణా జిల్లా వైపు ఈచర్ వ్యాన్ నంబర్ ఏపీ 16టి ఏ 1279లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్నట్లు హుకుంపేట పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. అప్పటి హుకుంపేట ఎస్‌హెచ్‌ఓ ఎన్. రవికుమార్ సిబ్బంది, మధ్యవర్తులతో కలిసి కోట్నాపల్లి గ్రామం వద్ద వాహనాన్ని తనిఖీ చేయగా ఏ 2 యెలగాల నాగేశ్వరరావు, ఏ 3 ధర్మరాజు పట్టుబడ్డారు.వారి వద్ద ఉన్న 20 గోనె సంచుల్లో మొత్తం 435 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం హుకుంపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి ఏ2, ఏ3లను అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు.ఈ కేసులో వడ్డేపూడి కోటయ్య ముందస్తు బెయిల్ పొంది న్యాయస్థానం ఎదుట లొంగిపోయాడు.ఈ కేసులో అప్పటి ఎస్ఐ ఎన్. రవికుమార్ చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో ఎంఈఓ, సర్పంచ్, వీఆర్వో, పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ తదితర సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసులో ఇన్వెంటరీ అధికారిగా పనిచేసిన ఎస్ఐ ఎన్. నాగకార్తిక్ కూడా కోర్టులో సాక్షిగా హాజరై స్వాధీనం చేసుకున్న గంజాయి ఇన్వెంటరీ ప్రక్రియకు సంబంధించిన వివరాలను సమర్పించారు.ఈ కేసులో చోడవరం కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చీపురుపల్లి సూర్యనారాయణ పోలీసుల తరపున కేసును సమర్థవంతంగా వాదించారు. పోలీసుల దర్యాప్తు ద్వారా సేకరించిన సాక్ష్యాధారాలను న్యాయస్థానం ముందు సమర్థవంతంగా ప్రవేశపెట్టడంతో ఏ2, ఏ 3లపై నేరం నిరూపితమైంది.దీంతో 9వ అదనపు జిల్లా,సెషన్స్ న్యాయస్థానం వారిద్దరికీ చెరో 10 ఏళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1 లక్ష జరిమానా విధించింది. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసులు నిరంతరం కఠిన చర్యలు చేపడుతున్నారని జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ ఈ సందర్భంగా తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.



## ఉద్యోగుల రాయితీ కల్పన తాత్సారంపై ఉద్యమమే శరణ్యం

**ఉద్యోగ వేదిక రాష్ట్ర చైర్మన్ జి.అస్కారరావు**

**విశాఖపట్నం, ఆగష్టు 28, జయ జయహే :**


ఉద్యోగి తనకు రావాల్సిన రాయితీలు తీసుకోవడానికి ప్రభుత్వ ఉదాసీనత వైఖరి వలన సకాలయంలో పొందలేకపోతున్నారని ఇది ఉద్యోగుల ఆర్థిక భద్రతకు విఘాతం కలుగుతున్నదని ఉద్యోగ వేదిక రాష్ట్ర చైర్మన్, ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జి.అస్కారరావు పేర్కొన్నారు. విశాఖలో కేఆరఎం కాలనీలో శుక్రవారం ఆయన ఓ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్ నియామకం, వేతన స్థిరీకరణ, పెండింగ్ డీఏలు విడుదల, దాచుకొన్న జీపీఎఫ్, ఏపీజీఎల్ వంటి సొమ్ములకు భద్రత, పార్ట్ ఫైనల్ విత్డ్రాయల్ వంటి విషయాల్లో ప్రభుత్వం ఉదాసీనత వహించడాన్ని ఉద్యోగులు అసలు సహించలేక పోతున్నారన్నారు. దీంతో ఉద్యోగ సంఘాలు క్రమంగా ప్రభుత్వ వైఖరిపై గొంతు ఎత్తుతున్నాయన్నారు తెలిపారు. ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థికపరమైన అంశాలపై తీవ్ర అసంతృప్తిగా ఉంటే మరోవైపు రాష్ట్ర పతి ఉత్తర్వుల అమలు కొరకు ఉద్యోగుల పదోన్నతులు, బదిలీలు నిలుపుదల చేయాడంతో ఉద్యోగులు తీవ్రమైన మానసిక వత్తిడికి లోనవుతున్నారన్నారు. ఆర్థికేతర సమస్యలపై అధికారులు కూడా సత్వరం స్పందించకపోవడం చాలా దారుణమన్నారు. తమ సంఘం తరపున ఆందోళన చేయాడానికి నిర్ణయించామని తెలిపారు. తమ సంఘ ప్రధాన కార్యదర్శి ఉద్యమ దశలను సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. త్వరలో ఉద్యమానికి సంబంధించిన వివరాలు వెల్లడిస్తామన్నారు.ఉద్యోగులను పాలక వర్గాలు పట్టించుకోకపోవడం కూడా తిరుగుబాటుకు ప్రధాన కారణమవుతున్నాదని అన్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి పీఆర్సీ కమిషన్‌ను నియమించడం లేదా నేరుగా 25% ఫిట్మెంట్ పీఆర్సీని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్ లోగల డీఏలను విడుదల,పదోన్నతుల, బదిలీలకు సంబంధించి ఫ్రీజింగ్ నూ ఎత్తివాయాలని డిమాండ్ చేశారు. సమావేశం లో విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు ఎస్వీ రమణ, జిల్లా,నగర కోశాధికారి కె. శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.




## మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆధ్వర్యంలో, కొవ్వూరు డీఎస్పీ దేవా కుమార్ ఆదేశాల మేరకు, నిడదవోలు సీఐ తిలక్ పర్యవేక్షణలో నిడదవోలు డిగ్రీ మహిళా కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.నిడదవోలు ఎస్ఐ జగన్ మోహన్, రెండో ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్, ఏఎస్సై-1605 జీఆర్‌కే గంగాధరరావు, రాజమండ్రి సైబర్ నేరాల విభాగం సిబ్బంది ప్రసాద్, సాయిదీప్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా శక్తి యాప్ వినియోగం, పోక్సో చట్టం, బాల్యవివాహాల నిరోధం, సైబర్ నేరాలపై జాగ్రత్తలు, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి క్రీడల్లో పాల్గొంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు.



## ఘనంగా లక్ష కుంకుమార్చన

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోట సత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా శ్రీ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.ఆలయ ప్రాంగణంలో లక్ష కుంకుమార్చన, చండీహోమం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని లక్ష కుంకుమార్చనలో భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించారు.చండీహోమం సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వి. హరి సూర్య ప్రకాష్, సహాయ కమిషనర్ ఏ కార్యనిర్వహణాధికారి, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవి శంకర్ ఆలయ నిర్వాహకులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com